ప్రజాజ్యోతి
కరీంనగర్
రాజన్న సిరిసిల్ల, జగిత్యాల, పెద్దపల్లి
శుక్రవారం 31, జులై 2026 | www.prajajyothinews.com | పేజీలు :10

# నేతన్నల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

– వ్యవసాయ, చేనేత జౌళి, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
–రూ.3.22 కోట్లతో రగుడు జంక్షన్ అభివృద్ధి పనుల ప్రారంభం
– నేత కార్మికులకు ఆర్డీ పాస్‌బుక్‌ల పంపిణీ





- రైతన్నలో ఆనందం.. ప్రజల్లో ఆందోళన
- రెడ్ అలర్ట్ జారీ వాతావరణ శాఖ
- భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం
- పొంగిపొర్లుతున్న వాగులు, వంకలు.. నిండుతున్న జలాశయాలు

## ఉమ్మడి కరీంనగర్ జిల్లాను
# ముంచెత్తిన వాన

కరీంనగర్ బ్యూరో,జూలై 30 (ప్రజాజ్యోతి):
ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో గత రెండు రోజులుగా కురుస్తున్న ఎడతెరిపిలేని వర్షాలు ప్రజాజీవనాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయి. కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల జిల్లాల్లో విస్తారంగా వర్షాలు కురవడంతో వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. చెరువులు, కుంటలు, జలాశయాలు వరద నీటితో కళకళలాడుతు న్నాయి. మరోవైపు ఈ వర్షాలు ఖరీఫ్ సాగుకు ఊతమివ్వడంతో రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. భారీ వర్షాల నేపథ్యంలో వాతావరణ శాఖ ఉమ్మడి జిల్లాకు రెడ్ అలర్ట్ జారీ చేసింది. రానున్న 24 నుంచి 48 గంటల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించింది. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వాగులు, వంకలు దాటే ప్రయత్నం చేయవద్దని అధికారులు సూచిస్తు న్నారు. నగరంలోని వర్ష ప్రభావిత ప్రాంతాలను. పరిశీలించిన మేయర్, డిప్యూటీ మేయర్ కరీంనగర్ లో గత రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో గురువారం మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ నగరంలోని పలు వర్ష ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించి పరిస్థితిని పరిశీలించారు

## వర్షాలపై సీపీ అప్రమత్తం.. ప్రభావిత ప్రాంతాల పరిశీలన

కరీంనగర్ క్రైం, జూలై 30, (ప్రజాజ్యోతి): గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో కరీంనగర్ పట్టణ శివార్లలో నీటిమునిగిన ప్రాంతాలను





## వేములవాడ బస్‌స్టేషన్ ఆధునీకరణకు శంకుస్థాపన

– కోరుట్ల మీదుగా బాసరకు ఎక్స్‌ప్రెస్ బస్సు ప్రారంభం చేసిన మంత్రులు

## సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురువాలి

–వేములవాడ శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంలో మంత్రుల పూజలు



# వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

## – ఎస్సై సిరిసిల్ల అశోక్




**ఇల్లంతకుంట జూలై 30 (ప్రజాజ్యోతి)** రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలంలోని పోలీస్ స్టేషన్ పరిధిలో ఎడతెరిపిలేకుండ కురుస్తున్న బారి వర్షాల వల్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అవసరం అయితే తప్ప బయటకు రావద్దని ఎస్ ఐ సిరిసిల్ల అశోక్ గురువారం రోజు విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు ఈ సందర్భంగా ఎస్ ఐ అశోక మాట్లాడుతూ భారీ వర్షాలు కురుస్తుందు వల్ల ప్రవహిస్తున్న వాగులు, వంకలు, చెరువులు, కాలువలు వద్దకు ఎవరు వెళ్లవద్దన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, చెరువులు, వాగులు, ప్రాజెక్టుల వద్దకు ప్రజలు, యువత వెళ్లకూడదన్నారు. వర్షం నీటి వల్ల రోడ్డుపై వాహనాలు స్కిడ్ అయ్యే ప్రమాదం ఉన్నందున, పరిమిత వేగంతో వాహనాలు నడపాలని సూచించారు. పిల్లలు, యువకులు చెరువులు, కాలువల దగ్గరకు సెల్ఫీలు తీసుకోవడానికి, ఈత కొట్టడానికి వెళ్లకుండా తల్లిదండ్రులు దృష్టి సారించాలన్నారు. అలాగే విద్యుత్ పరిక రాలకు పోల్స్ కు దూరంగా ఉండా లనీ. విపత్కర పరిస్థి తుల్లో ప్రజలకు సేవల ం చడానికి పోలీసు అధికా రులు, సిబ్బంది అందుబా టులో ఉన్నారని, ఎటువం టి సహాయం కావాలన్నా డయల్ 100 లేదా 112 కి లేదా స్థానిక గ్రామ పోలీస్ అధికారులకి ఫోన్ చేయాలనీ తెలిపారు

# సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురువాలి

## –వేములవాడ శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంలో మంత్రుల పూజలు



**వేములవాడ,జూలై.30:ప్రజాజ్యోతి.** సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురువాలని జిల్లా ఇంచార్జి మంత్రి, మార్కెటింగ్, వ్యవసాయ, చేనేత జౌళి, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఎస్సీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆకాంక్షించారు. జిల్లా పర్యటనలో భాగంగా వేములవాడ కు చేరుకున్న మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కు ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గితే పుష్ప గుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. మంత్రులకు శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంలోకి అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, సంజయ్ స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు వారికి ఆశీర్వచనం చేసి.. స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో శ్రీ స్వామివారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం ఏకాంతంగా నిర్వహించారు. అలాగే శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంలో జూలై 30వ తేదీ నుండి ఆగస్టు 1వ తేదీ వరకు సత్వర సద్యఃసువృష్టి (సకాల వర్షప్రాప్తి) కోసం ఋశ్యశృంగ ప్రతిష్ఠ, వరుణయాగం, వరుణ పర్జన్య జపానుష్ఠానాలు, హవనాలు, శ్రీ భీమేశ్వర స్వామివారికి సంతత ధారాభిషేకం నిర్వహించనున్నారు. అనంతరం మంత్రులు, ఎమ్మెల్యేలు యాగశాలలో వరుణయాగాన్ని అధికారికంగా ప్రారంభించారు. భీమేశ్వర సదన్‌లోని ఈశాన్య మూలలో వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని ఏర్పాటు చేసిన ఇంకుడు గుంతకు ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రారంభించారు. అనంతరం భీమేశ్వర సదన్‌లో ఏర్పాటు చేసిన వసతి గృహాలను సందర్శించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే శ్రీ ఆది శ్రీనివాస్ శాలువాలతో మంత్రులను సత్కరించి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రులు, ఎమ్మెల్యేలు మాట్లాడుతూ, వరుణయాగం అనేది కేవలం ఆధ్యాత్మిక క్రతువే కాకుండా లోకకళ్యాణాన్ని ఆకాంక్షిస్తూ నిర్వహించే మహోన్నత వైదిక సంప్రదాయమని పేర్కొన్నారు. సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురవడం ద్వారా చెరువులు, కుంటలు, జలాశయాలు నిండిపోతాయని, భూగర్భ జలాలు పెరుగుతాయని, రైతులకు సాగునీరు సమృద్ధిగా లభించి పంటలు బాగా పండుతాయని తెలిపారు. సమృద్ధిగా వర్షాలు కురిస్తే రైతులు ఆర్థికంగా బలోపేతం అవడంతో పాటు రాష్ట్రం వ్యవసాయరంగంలో మరింత అభివృద్ధి సాధిస్తుందని, ప్రజలకు తాగునీటి సమస్యలు తీరడంతో పాటు పర్యావరణ సమతుల్యత కూడా నెలకొంటుందని అన్నారు. రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవించాలని, తెలంగాణ సస్యశ్యామలంగా వెలుగొందాలని ఆకాంక్షిస్తూ ఈ వరుణయాగాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో దేవస్థానం కార్యనిర్వహణాధికారి శ్రీమతి రమాదేవి, అదనపు ఎస్పీ చంద్రయ్య, ఆర్డీఓ కే ఎస్ బీ కుమారి, మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, మున్సిపల్ కమిషనర్ లోకేష్, తహసీల్దార్ జయంత్ తదితరులు పాల్గొన్నారు.

# రేషన్ కార్డు దారులకు ఈరోజుతో ఈ కెవైసి గడువు ముగింపు

## – చేయించుకొని వారికి బియ్యం నిలిచే అవకాశం

**కొనరావుపేట, జూలై.30(ప్రజాజ్యోతి)** రేషన్ కార్డు కలిగిన లబ్ధిదారులు తప్పనిసరిగా ఈ కేవైసీ పూర్తి చేయాలని ప్రభుత్వం సూచించింది. ఈరోజుతో ఈ కేవైసీ గడువు ముగియనున్న నేపథ్యంలో ఇంకా ఈ కేవైసీ చేయించుకొని లబ్ధిదారులకు రేషన్ బియ్యం పంపిణీలో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని సర్పంచ్ జిన్న అనుష అనిల్ కుమార్ తెలిపారు. ఐదు సంవత్సరాల వయస్సు ఉన్న పిల్లలు మినహాయించి రేషన్ కార్డులో పేరు ఉన్న ప్రతి ఒక్కరూ అలాగే కొత్త రేషన్ కార్డుల్లో పేర్లు నమోదు చేసుకున్న వారు ఈ రోజు ఈ కేవైసీ తప్పనిసరిగా చేసుకోవాలని అన్నారు. ఎల్ నినో ప్రభావం కారణంగా ఆగస్టు సెప్టెంబర్ అక్టోబర్ మూడు నెలలకు సంబంధించిన రేషన్ బియ్యాన్ని ఒకేసారి పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే దీనితో ఈ కేవైసీ చేయించుకొని వారికి మూడు నెల రేషన్ బియ్యం అందని పరిస్థితి ఉండొచ్చని తెలిపారు.

## దశాబ్ద కాలంగా తాత్కాలిక మరమ్మతులే..

# శాశ్వత వంతెన ఎప్పుడు?



**కొనరావుపేట,జూలై.30(ప్రజాజ్యోతి)** కొనరావుపేట మండలం మామిడిపల్లి గ్రామంలోని మూలవాగుపై ఉన్న వంతెన మరోసారి వర్షాలకు దెబ్బతింది. దశాబ్ద కాలంగా వర్షం వచ్చినప్పుడల్లా రహదారి కొట్టుకుపోవడం, తాత్కాలిక మరమ్మతులతోనే సరిపెడుతున్నారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. శాశ్వత వంతెన నిర్మిస్తామని అధికారులు, ఎన్నికల సమయంలో ప్రజాప్రతినిధులు హామీలు ఇచ్చినా అమలు కాలేదన్నారు. దీంతో మండల కేంద్రానికి రాకపోకలు తీవ్రంగా ఇబ్బందిగా మారుతున్నాయని, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ చొరవ తీసుకొని శాశ్వత వంతెన నిర్మాణం చేపట్టాలని గ్రామస్తులు కోరారు.

# గ్రామాల్లో పేద ప్రజలకు ఉచిత వైద్య సేవలు చేయడం అభినందనీయం

## – సర్పంచ్ ఓల్లాల రజిత వెంకటేష్



**ఇల్లంతకుంట జూలై 30 (ప్రజాజ్యోతి)** రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలంలోని అనంతారం గ్రామంలో గురువారం రోజు కాత్యాయని కంటి హాస్పిటల్ సిరిసిల్ల వారి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో 150 మంది ప్రజలు కంటి పరీక్షలు చేసుకోగా అవసరమైన వారికీ మందులు, కంటి అద్దాలు హాస్పిటల్ సిబ్బంది అందజేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ రజిత వెంకటేష్ మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలకు కాత్యాయని హాస్పిటల్ వారు ఉచిత వైద్య సేవలు అందించడం అభినందనీయమని, వారికి గ్రామ ప్రజల తరుపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో కాత్యాయని హాస్పిటల్ వైద్యులు సింగ్, లత శ్రీనివాస్ వైద్య సిబ్బంది, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# వర్షంతో రైతుల కళ్ళల్లో ఆనందం

**ప్రజాజ్యోతి ఎలిగేడు ప్రతినిధి** రెండు నెలలుగా వర్షాలు పడకపోవడంతో రైతులు ఆందోళన చెందారు బావులు ఉన్న రైతులు నార్లు పోసి దుక్కి దున్నడానికి నీళ్లు లేక వర్షం కోసం ఎదురు చూశారు బంగాళాఖాతంలో ఏర్పడ్డ అల్పపీడనం కారణంగా రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు ఎలినో ప్రభావంతో వర్షాలు తక్కువగా కురుస్తాయని వాతావరణ శాఖ ప్రకటించడంతో రైతులు ఆందోళనకు గురయ్యారు మహారాష్ట్రలో కూడా వర్షాలు పడకపోవడంతో శ్రీరామ్ సాగర్ ప్రాజెక్టులో నీరు లేక విడుదల చేస్తారో లేదో అని రైతులు పంటలు వేయగా వర్షం కోసం ఎదురు చూశారు మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో రైతుల కళ్ళల్లో ఆనందం మూడు రోజులా కురుస్తున్న వర్షాలకు పావుల్లో భూగర్భ జలాలు పెరిగి పంటలు వేసిన పండుతాయని రైతులు ధీమా వ్యక్తం చేస్తున్నారు ప్రభుత్వం అరితడి పంటలు వేయాలని ప్రకటించడంతో రైతులు ఏ పంట వేయాలో అ-ర్థం కాని పరిస్థితిలో ఉన్నారు పత్తి కూరగాయలు పండించే రైతులకు ఊరటనిచ్చింది

# సోమారం గ్రామంలో ఘనంగా పౌర హక్కుల దినోత్సవం

- కుల వివక్ష లేని సమసమాజ స్థాపనే లక్ష్యం హుజురాబాద్ ఏసిపి మాధవి



సైదాపూర్, జులై 30 (ప్రజాజ్యోతి) గురువారం వె-సైదాపూర్ మండలం సోమారం గ్రామములో పౌర హక్కుల దినోత్సవము ను ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన హైదరాబాద్ ఏసిపి మాధవి. గ్రామస్థుల నుద్దేశించి పలు కీలక అంశాలపై అవగాహన కల్పించారు .అంటరానితనం నిర్మూలన సమాజంలో అంటరానితనం ఒక సామాజిక పిశాచి అని, దానిని పూర్తిగా నిర్మూలించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అన్నారు. చట్టాలపై అవగాహన అంటరానితనం మరియు కుల వివక్షకు వ్యతిరేకంగా ఉన్న చట్టాల గురించి, వాటి అమలు తీరు గురించి ప్రజలకు వివరించారు. గ్రామాలలో ఇప్పటికీ కొన్ని చోట్ల కొనసాగుతున్న 'రెండు గ్లాసుల పద్ధతి' (అసమానతలకు ప్రతీక అయిన ఆచారం) ఎట్టి పరిస్థితుల్లోనూ ఆమోదయోగ్యం కాదని, దీనిని పూర్తిగా మానుకోవాలని సూచించారు. కుల, మత భేదాలు రూపుమాపేందుకు సహపంక్తి భోజనాలు ఎంతో దోహదపడతాయని గుర్తుచేశారు. గ్రామస్థులందరూ కుల, మతాల గోడలను బద్దలు కొట్టి, ఏమరుపాటు లేకుండా అందరూ కలిసిమెలిసి ఐకమత్యంగా జీవించాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. కుల వివక్ష లేని సమసమాజ స్థాపన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక తహశీల్దార్ శ్రీనివాస్, సీఐ శ్రీనివాస్ హుజూరాబాద్, సోమారం గ్రామ సర్పంచ్ అనిత, స్థానిక వార్డు మెంబర్లు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ వినోద్, కార్యదర్శి రాజీవ్, జీపీవో శ్రీనివాస్, మరియు ఇతర గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మానవ అక్రమ రవాణాపై విద్యార్థులకు అవగాహన



సైదాపూర్, జూలై 30 (ప్రజాజ్యోతి): ప్రపంచ మానవ అక్రమ రవాణా నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకుని సైదాపూర్ మండలం సోమారం గ్రామంలోని మోడల్ స్కూల్లో గురువారం విద్యార్థి, విద్యార్థినులకు మానవ అక్రమ రవాణాపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా బాలల పరిరక్షణ అధికారి (డీసీపీఓ) పర్వీన్ ముఖ్య అతిథిగా హాజరై మానవ అక్రమ రవాణా అంటే ఏమిటి, దాని వల్ల కలిగే ప్రమాదాలు, పిల్లలు, యువత తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. అపరిచితుల మాటలు నమ్మవద్దని, ఉద్యోగాలు లేదా ఇతర ఆశలు చూపించి మోసం చేసే వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మహిళా సాధికారత కేంద్రం జెండర్ స్పెషలిస్టులు శైలజ, కవిత మాట్లాడుతూ విద్యార్థులు తమ వ్యక్తిగత వివరాలను అపరిచితులతో పంచుకోవద్దని, సోషల్ మీడియాను బాధ్యతాయుతంగా ఉపయోగించాలని, ఏదైనా అనుమానాస్పద పరిస్థితి ఎదురైతే వెంటనే తల్లిదండ్రులు లేదా ఉపాధ్యాయులకు తెలియజేయాలని సూచించారు. సఖి కౌన్సిలర్ రేణుక మాట్లాడుతూ మహిళలు, పిల్లలకు అవసరమైన సహాయం కోసం అందుబాటులో ఉన్న 181 టోల్‌ఫ్రీ హెల్ప్‌లైన్ సేవల గురించి వివరించారు. వేధింపులు, ఇబ్బందులు లేదా ప్రమాద పరిస్థితులు ఎదురైనప్పుడు వెంటనే 181కు కాల్ చేసి సహాయం పొందవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ శాంత, ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# వర్షాలకు జలమయమైన కొత్తపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి

-రాకపోకలకు తీవ్ర అంతరాయం

-శాశ్వత పరిష్కారానికి ఆర్ఓబి నిర్మించాలని ప్రజల విజ్ఞప్తి

**పెద్దపల్లి, ప్రతినిధి జూలై 30 ప్రజాజ్యోతి:** గత మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా పెద్దపల్లి మండలంలోని కొత్తపల్లి గ్రామం వద్ద ఉన్న రైల్వే అండర్ బ్రిడ్జి పూర్తిగా వరద నీటితో నిండిపోయింది. దీంతో వాహనాలు, ద్విచక్ర వాహనాలు, పాదచారులు రాకపోకలు సాగించలేని పరిస్థితి ఏర్పడి స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సికింద్రాబాద్--న్యూఢిల్లీ ప్రధాన రైల్వే మార్గంలోని దక్షిణ మధ్య రైల్వే పరిధిలో గతంలో అనేక చోట్ల రైల్వే గేట్లను తొలగించి వాటి స్థానంలో అండర్ బ్రిడ్జిలను నిర్మించారు. అయితే వర్షాకాలం ప్రారంభమైన ప్రతిసారీ ఈ అండర్ బ్రిడ్జిల్లో భారీగా వర్షపు నీరు చేరి రోజుల తరబడి నిల్వ ఉండటంతో ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయి. ప్రతి ఏడాది ఇదే సమస్య పునరావృతమవుతున్నప్పటికీ శాశ్వత పరిష్కారం మాత్రం కనిపించడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సాంకేతిక అంశాలు, వర్షపు నీటి పారుదల, డ్రైనేజీ వ్యవస్థ, భౌగోళిక పరిస్థితులు వంటి అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకుని అండర్ బ్రిడ్జిలను నిర్మించాల్సి ఉన్నప్పటికీ కొన్ని ప్రాంతాల్లో తగిన ప్రణాళిక లేకపోవడంతో వర్షాకాలంలో అవి నీటి తో నిండిపోయి ప్రయాణానికి అనర్హంగా మారుతున్నాయని పలువురు అభిప్రాయపడుతు న్నారు. కొత్తపల్లి అండర్ బ్రిడ్జిలో వరద నీరు నిల్వ ఉండటంతో వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాలను ఆశ్రయించాల్సి వస్తోంది. విద్యార్థులు, ఉద్యోగులు, రైతులు, అత్యవసర సేవలు కూడా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. రాత్రి వేళల్లో పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి సమస్యలకు శాశ్వత పరిష్కారంగా రైల్వే ఓవర్ బ్రిడ్జిల (ఆర్ఓబీ) నిర్మాణాన్ని ప్రాధాన్యత ఇవ్వాలని ప్రజలు కోరుతున్నారు. అవసరమైన చోట్ల ఓవర్ బ్రిడ్జిలు నిర్మించడంతో పాటు ఇప్పటికే ఉన్న అండర్ బ్రిడ్జిల వద్ద శక్తివంతమైన నీటి పారుదల వ్యవస్థ, పంపింగ్ సదుపాయాలు, డ్రైనేజీ కాలువలను ఏర్పాటు చేసి వర్షపు నీరు నిల్వ కాకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఇప్పటికైనా దక్షిణ మధ్య రైల్వే అధికారులు స్పందించి కొత్తపల్లి అండర్ బ్రిడ్జి సమస్యను శాశ్వతంగా పరిష్కరించేలా తక్షణ చర్యలు చేపట్టాలని గ్రామస్తులు, వాహనదారులు, ప్రజాప్రతినిధులు కోరుతున్నారు.

# వేములవాడ బస్‌స్టేషన్ ఆధునీకరణకు శంకుస్థాపన

– కోరుట్ల మీదుగా బాసరకు ఎక్స్‌ప్రెస్ బస్సు ప్రారంభం చేసిన మంత్రులు



**వేములవాడ, జులై, 30: ప్రజాజ్యోతి.** వేములవాడ తిప్పాపూర్ బస్‌స్టేషన్ ఆధునీకరణ పనులకు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ గురువారం శంకుస్థాపన చేశారు. అనంతరం వేములవాడ--కోరుట్ల మీదుగా బాసరకు కొత్త ఎక్స్‌ప్రెస్ బస్సును ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం, సంజయ్ కుమార్, మున్నూరు కాపు కార్పొరేషన్ చైర్మన్ బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి, ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి, జిల్లా కలెక్టర్ గరీమా అగర్వాల్, జిల్లా ఎస్పీ మహేష్ బి గీతే మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడిన 48 గంటల్లోనే మహిళలకు మహాలక్ష్మి పథకం ద్వారా ఉచిత బస్సు ప్రయాణాన్ని అమలు చేసి ఇచ్చిన హామీని నిలబెట్టుకుందని అన్నారు. మహిళల ఉచిత ప్రయాణంతో ఆర్టీసీలో ప్రయాణికుల సంఖ్య గణనీయంగా పెరగడంతో కొత్త బస్సులు కొనుగోలు చేయడంతో పాటు సిబ్బంది నియామకాలు కూడా చేపట్టామని తెలిపారు. 1984లో నిర్మించిన వేములవాడ బస్‌స్టేషన్‌ను రూ. 1.62 కోట్ల వ్యయంతో ఆధునీకరిస్తున్నామని చెప్పారు. దక్షిణ కాశిగా పేరుగాంచిన వేములవాడకు ప్రతిరోజూ సుమారు 250 బస్సులు, 560 ట్రిప్పులు నడుస్తున్నాయని పేర్కొన్నారు. కోరుట్ల మీదుగా బాసరకు కొత్త ఎక్స్‌ప్రెస్ బస్సును ప్రారంభించామని, గతంలో ముంబైకి కూడా బస్సు సౌకర్యం కల్పించామని గుర్తు చేశారు. నష్టాల్లో ఉన్న ఆర్టీసీని లాభాల బాట పట్టించామని, ఉద్యోగులకు ఇచ్చిన హామీలను దశలవారీగా అమలు చేస్తున్నామని తెలిపారు... మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రముఖ దేవాలయ ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధితో పాటు బస్‌స్టేషన్లను ఆధునీకరిస్తున్నామని అన్నారు. దేశంలోనే అతిపెద్ద ప్రజారవాణా సంస్థగా తెలంగాణ ఆర్టీసీ మహిళలకు ఉచిత ప్రయాణాన్ని విజయవంతంగా అందిస్తోందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు చేరుతున్నాయని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా వరుణ పూజలు నిర్వహిస్తున్న నేపథ్యంలో ఇటీవల కురుస్తున్న వర్షాలను సద్వినియోగం చేసుకుని రైతులు ఆరుతడి పంటల సాగుపై దృష్టి పెట్టాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ వేములవాడ తిప్పాపూర్ బస్‌స్టేషన్ ఆధునీకరణకు రూ. 1.62 కోట్లు మంజూరు చేసిన మంత్రి పొన్నం ప్రభాకర్‌కు నియోజకవర్గ ప్రజల తరపున కృతజ్ఞతలు తెలిపారు.

# కూలిన ఇండ్లను సందర్శించిన మాజీ ఎమ్మెల్యే సుంకే రవిశంకర్



**గంగాధర జూలై 30: (ప్రజా జ్యోతి):** గంగాధర మండలం నారాయణపూర్ గ్రామంలో ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షాల కారణంగా అర్ధరాత్రి ఆరు ఇండ్లు కూలిపోయాయి. చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకే రవిశంకర్ గురువారం గ్రామాన్ని సందర్శించారు. గ్రామంలోని దెబ్బతిన్న ప్రాంతాలను ఆటోలో తిరుగుతూ పరిశీలిం చిన ఆయన, కూలిపోయిన ప్రతి ఇంటి బాధిత కుటుంబాన్ని స్వయంగా కలిసి వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. తక్షణ అవసరాల కోసం ప్రతి కుటుంబానికి రూ. 2,000 చొప్పున ఆర్థిక సహాయం అందజేశారు. అనంతరం మండల ఎంఆర్ఓ, ఎంపీడీఓ లతో మాట్లాడిన సుంకే రవిశంకర్, బాధిత కుటుంబాలకు తక్షణ ఆర్థిక సహాయం, ప్రభుత్వ పరంగా పునరావాసం కల్పించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. స్పందించిన అధికారులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని, బాధిత కుటుంబాల వివరాలను సేకరించి నష్టాన్ని అంచనా వేశారు. అలాగే, ఇళ్లు కూలిన కుటుంబాలను సురక్షిత ప్రాంతాలకు తరలించే చర్యలు చేపడుతున్నామని తెలిపారు. గ్రామస్థులు కూడా బాధితులకు ప్రభుత్వం త్వరితగతిన పూర్తి సహాయం అందించాలని కోరారు.

# ప్రణాళికాబద్ధంగా రాజన్న ఆలయ విస్తరణ పనులు

### – ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్



**వేములవాడ,జులై,30:ప్రజాజ్యోతి.** దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన శ్రీ రాజరాజేశ్వరస్వామి దేవస్థానాన్ని భక్తులకు మరింత సౌకర్యవంతమైన ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి పనులు చేపడుతోందని రాష్ట్రప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తెలిపారు. రాజన్న ఆలయంలో నిర్వహిస్తున్న మూడు రోజుల వరుణ యాగ ప్రారంభోత్సవంలో రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎమ్మెల్యేలు తదితర ప్రజాప్రతినిధులతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచనల మేరకు దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో ఆలయ అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. ఆలయానికి వచ్చే భక్తులకు శీఘ్ర దర్శనం, మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ఆలయ అభివృద్ధి, విస్తరణ కోసం రాష్ట్రప్రభుత్వం 2023–24లో రూ. 50 కోట్లు, 2024–25లో రూ. 100 కోట్లు కేటాయించగా, అనంతరం మరో రూ. 99.40 కోట్లు మంజూరు చేయడంతో అభివృద్ధి పనులు శరవేగంగా కొనసాగుతున్నాయని వెల్లడించారు. ప్రస్తుతం ఆలయ అభివృద్ధి పనుల్లో సుమారు 45 శాతం పూర్తయ్యాయని, మరో 10 నుంచి 12 నెలల్లో పూర్తి స్థాయిలో పనులు ముగించి, రాబోయే వెయ్యేళ్ల అవసరాలకు అనుగుణంగా రాజన్న ఆలయాన్ని తీర్చిదిద్దుతామని తెలిపారు. భక్తుల సూచనలు, సలహాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతాయని పేర్కొన్నారు. పర్యాటక శాఖ ఆధ్వర్యంలో సుమారు రూ. 12 కోట్లతో వేములవాడ గుడి చెరువు బండ్ పార్క్ లో ఆధునిక పార్కు, భారీ శివుడి విగ్రహం, మొక్కలు, నటరాజ విగ్రహం పనులు పూర్తి చేసి ప్రారంభించినట్లు తెలిపారు. అలాగే రూ. 10 కోట్లతో బద్దిపోచమ్మ ఆలయ అభివృద్ధి పనులు, రూ. 47 కోట్లతో వేములవాడలో 80 అడుగుల రహదారి విస్తరణ పనులు కూడా కొనసాగుతున్నాయని చెప్పారు. భక్తులకు అన్నదాన సేవలను మరింత విస్తరించేందుకు రూ. 35 కోట్లతో అన్నదాన సత్రం నిర్మాణానికి ప్రభుత్వం ప్రత్యేక నిధులు మంజూరు చేసిందని తెలిపారు. ఈ సందర్భంగా రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తూ, వేములవాడ డిపోకు 20 కొత్త బస్సులు కేటాయించడం, అలాగే రూ. 1.60 కోట్లతో తిప్పాపూర్ బస్టాండ్ ఆధునీకరణ పనులకు శంకుస్థాపన చేయడం ప్రాంత ప్రజలకు ఎంతో ఉపయోగపడుతుందని ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు.

# వానలో తడుస్తూనే సేవలు.. ప్రజల భద్రతే ధ్యేయం

### 13వ వార్డు కౌన్సిలర్ సిద్ధ తిరుపతి



**సుల్తానాబాద్, జూలై 30: (ప్రజా జ్యోతి)** ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో సుల్తానాబాద్ మున్సిపాలిటీ 13వ వార్డులో ప్రజల భద్రతకు ప్రాధాన్యం ఇస్తూ కౌన్సిలర్ సిద్ధ తిరుపతి గురువారం క్షేత్రస్థాయిలో పర్యటించారు. వానలో తడుస్తూనే వార్డు అధికారి తిరుపతి, మున్సిపల్ సిబ్బందితో కలిసి శిథిలావస్థకు చేరిన ఇళ్లను పరిశీలించి, ప్రమాదకర ప్రాంతాలను గుర్తించారు. ఈ సందర్భంగా సిద్ధ తిరుపతి మాట్లాడుతూ, వర్షాలు కొనసాగుతున్నందున శిథిలావస్థలో ఉన్న ఇళ్లలో నివసిస్తున్న కుటుంబాలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అవసరమైతే వెంటనే సురక్షిత ప్రాంతాలకు తరలిపోవాలని, పాత భవనాలు, బలహీనమైన గోడలు, విద్యుత్ తీగల సమీపంలో ఎవరూ ఉండవద్దని హెచ్చరించారు. వర్షాల కారణంగా నీటి నిల్వలు, డ్రైనేజీ సమస్యలు, విద్యుత్ ప్రమాదాలు తలెత్తే అవకాశమున్నందున ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలని కోరారు. చెట్లు కూలిపోవడం, ఇళ్లు దెబ్బతినడం లేదా ఇతర అత్యవసర పరిస్థితులు ఎదురైతే వెంటనే మున్సిపల్ అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. సమాచారం అందిన వెంటనే సమస్యల పరిష్కారానికి యంత్రాంగం సిద్ధంగా ఉంటుందని తెలిపారు. ప్రజల ప్రాణాలు, ఆస్తుల రక్షణే తమ ప్రధాన లక్ష్యమని పేర్కొన్న సిద్ధ తిరుపతి, వర్షాలు తగ్గే వరకు ప్రతి ఒక్కరూ అధికారుల సూచనలు పాటించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు అధికారి తిరుపతి, కాంగ్రెస్ నాయకుడు వేగోళం కర్ణాకర్, మున్సిపల్ సిబ్బంది, వార్డు ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# రేషన్ కార్డు ఉన్నవారు ఈ కేవైసీ చేయకపోతే కార్డు కట్..

### – ఈ కేవైసీకి నేటితో లాస్ట్ డేట్ రేషన్ కార్డు దారులు గమనించాలి.. – మండల రేషన్ డీలర్లు..

**ముత్తారం జులై ,30 (ప్రజా జ్యోతి)**మండలంలో రేషన్ కార్డు ఉన్నవారికి బిగ్ అలర్ట్. రేషన్ కార్డు ఉన్నవారు ఈకేవైసీ పూర్తి చేయడానికి కేవలం మూడు రోజులు మాత్రమే సమయం మిగిలి ఉంది. రేషన్ కార్డుదారులు తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని లేకపోతే కార్డు ఇనాక్టివ్ అయిపోవడం వల్ల రేషన్ సరుకులు తీసుకోలేరు. ఇ–కేవైసీ(వ–ఖ్జ) ధృవీకరణను పూర్తి చేయడానికి నేటి వరకు అనగా 31 జూలై అప్పటిలోగా పూర్తి చేయకపోతే మీ కార్డు, నెలవారీ సరుకులను కోల్పోయే ప్రమాదం ఉంది. ఇప్పటికీ చాలామంది కేవైసీ ప్రక్రియ పూర్తి చేయలేదు. దీంతో ప్రతీఒక్కరూ గడువులోకా పూర్తి చేసుకోవాలని అధికారులు చెబుతున్నారు. ఈ ప్రక్రియను సింపుల్‌గా ఎక్కడైనా పూర్తి చేయవచ్చు. కేవైసీ పూర్తి చేసేందుకు మీరు మీ సొంత ఊరికి తిరిగి వెళ్లాల్సిన అవసరం లేదు. బయోమెట్రిక్ లేదా ఐరిస్ స్కానింగ్ కోసం మీ ఒరిజినల్ ఆధార్ కార్డుతో సమీపంలోని ఏదైనా రేషన్ షాపుకు లేదా మీసేవా కేంద్రానికి వెళితే సరిపోతుంది. ఈ ప్రక్రియ కోసం ఎలాంటి రుసుం చెల్లించాల్సిన అవసరం లేదు. ఉచితంగా కంప్లీట్ చేసుకోవచ్చని పౌరసరఫరాల శాఖ అధికారులు, రేషన్ డీలర్లు చెబుతున్నారు. రేషన్ కార్డులో పేరు ఉన్న ప్రతీ లబ్దిదారుడు ఈ ప్రాసెస్ పూర్తి చేయాలి. 8 ఏళ్లుపైబడిన ప్రతీఒక్కరూ తప్పనిసరిగా కేవైసీ పూర్తి చేయాలి. జులై 31లోగా పూర్తి చేయకపోతే రేషన్ సరుకులు నిలిచిపోతాయనీ ప్రభుత్వం మరో పక్క డీలర్లు తెలిపారు. అలాగే తెలంగాణ ప్రభుత్వం త్వరలో పంపిణీ చేయనున్న కొత్త స్మార్ట్ రేషన్ కార్డు కూడా రాదు ఆగస్ట్ నుంచి స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేసే విధంగా ప్రభుత్వం ఆలోచన ఉన్నది కనుక రేషన్ కార్డు దారులు గమనించి ఈ కేవైసీ చేసుకోవాలని మండలంలోని డీలర్లు తెలుపుతున్నారు.

# అటవీ శాఖ వ్యాసరచన పోటీల్లో పారమిత వరల్డ్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ



**కరీంనగర్ టౌన్, జులై 30 (ప్రజాజ్యోతి )** తెలంగాణ రాష్ట్ర అటవీ శాఖ ఆధ్వర్యంలో కరీంనగర్‌లోని డీర్ పార్క్‌లో "జీవ వైవిధ్యంలో పులుల పాత్ర (రోల్ ఆఫ్ టైగర్ ఇన్ బయో డైవర్సిటి ) అంశంపై నిర్వహించిన జిల్లా స్థాయి వ్యాసరచన పోటీల్లో ఆల్గునూర్‌లోని పారమిత వరల్డ్ స్కూల్ విద్యార్థులు అసాధారణ ప్రతిభ కనబరిచారు. పోటీల్లో పాల్గొన్న పారమిత విద్యార్థులు ప్రథమ, బహుమతులను కైవసం చేసుకున్నారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఏం. శ్రీకర్ తెలిపారు. 9వ తరగతి విభాగం లో చింతల శ్రీనిధి ప్రథమ బహుమతి, 8వ తరగతి విభాగం లో తుమ్మ శ్రీ శ్రాన్వి ప్రథమ బహుమతి, 7వ తరగతి విభాగం లో యశస్వి పోలుసాని ప్రథమ బహుమతి సాధించి తమ ప్రతిభను చాటారు. పులుల సంరక్షణ, జీవ వైవిధ్య పరిరక్షణ, పర్యావరణ సమతుల్యతలో పులుల ప్రాధాన్యత వంటి అంశాలను విద్యార్థులు తమ వ్యాసాల్లో సమగ్రంగా వివరించి న్యాయనిర్ణేతల ప్రశంసలు అందుకున్నారు. పోటీలకు ముఖ్య అతిథులుగా డిప్యూటీ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్ ఎస్. సత్యనారాయణ, కరీంనగర్ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ షౌకత్ హుస్సేన్ హాజరై విజేతలకు బహుమతులు అందజేసారు. విద్యార్థుల్లో అటవీ సంరక్షణ, పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంపొందించడం ఎంతో అవసరమని వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ఛైర్మెన్ ఈ. ప్రసాద రావు గారు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ పుస్తకాల్లోని జ్ఞానంతో పాటు ప్రకృతిని ప్రేమించడం, పర్యావరణాన్ని కాపాడడం కూడా మన బాధ్యత అని తెలిపారు. గెలుపొందిన విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమం లో పాఠశాల డైరెక్టర్స్ ప్రసూన,వి. యూ. ఎం. ప్రసాద్ ,ప్రిన్సిపాల్ ఎం. శ్రీకర్, సమన్వయకర్త దీప్తి రాణి, ఉపాధ్యాయ బృందం కరీంనగర్ అటవీ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# వర్షాల దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

### – మున్సిపల్ కమిషనర్ నాగరాజు



**చొప్పదండి, జూలై 30 (ప్రజా జ్యోతి):** వర్షాలు కురుస్తున్న దృశ్య పట్టణ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, విష జ్వరాలు ప్రబలే అవకాశం ఉన్నందున తగిన జాగ్రత్తలు తీసుకోవాలని చొప్పదండి మున్సిపల్ కమిషనర్ కీర్తి నాగరాజు సూచించారు. కరెంటు స్తంభాలను ముట్టుకోవద్దని, ఇంటి పరిసరాలను చెత్తాచెదారం లేకుండా పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. శిథిలమైన లేదా పాక్షింగా శిథిలమైన గృహాలలో నివసించవద్దని, కాచి చల్లార్చి వడకట్టిన నీటిని తాగాలని, దోమల బారిన పడకుండా కిటికీలకు దోమతెరలు ఉపయోగించాలని చెప్పారు. ప్రతి మంగళవారం, శుక్రవారం డ్రైడే పాటించాలని అన్నారు. బహిరంగ మలమూత్ర విసర్జన చేయకూడదు, చేయనివ్వరాదన్నారు. పాత కూలర్లు, పూల కుండీలు ఇతర పాత్రలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని పేర్కొన్నారు.

## వర్షాలపై సీపీ అప్రమత్తం.. ప్రభావిత ప్రాంతాల పరిశీలన



కరీంనగర్ క్రైం, జూలై 30, (ప్రజాజ్యోతి): గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో కరీంనగర్ పట్టణ శివార్లలో నీటిమునిగిన ప్రాంతాలను పోలీస్ కమిషనర్ గౌస్ అలం గురువారం ప్రత్యక్షంగా పరిశీలించారు. తీగలగుట్టపల్లి రైల్వే బ్రిడ్జి,బొమ్మకల్ ఫ్లైఓవర్ పరిసర ప్రాంతాల్లో వర్షపు నీరు భారీగా నిల్వ ఉండటంతో అక్కడికి వెళ్లిన సీపీ పరిస్థితిని సమీక్షించి అధికారులకు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. వర్షపు నీరు నిలిచిన ప్రాంతాల్లో అవసరమైన చోట వెంటనే ట్రాఫిక్ డైవర్షన్‌లు ఏర్పాటు చేయాలని రహదారులపై వాహనాల రాకపోకలకు ఎలాంటి ఆటంకం కలగకుండా చర్యలు తీసుకోవాలని స్థానిక పోలీసు అధికారులను ఆదేశించారు. ప్రజల భద్రతకు ప్రాధాన్యం ఇస్తూ,ప్రమాదాలు జరగకుండా అప్రమత్తంగా విధులు నిర్వహించాలని సూచించారు. ఈ సందర్భంగా సీపీ ప్రజలకు పలు సూచనలు చేశారు. వర్షాకాల పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని వాహనాలను నెమ్మదిగా, జాగ్రత్తగా నడపాలని,నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో అనవసరంగా ప్రయాణాలు చేయకుండా ఉండాలని కోరారు. ట్రాఫిక్ పోలీసుల సూచనలను పాటిస్తూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. తిగలగుట్టపల్లి రైల్వే బ్రిడ్జి, బొమ్మకల్ ఫ్లైఓవర్ వద్ద నీరు నిల్వ ఉన్న ప్రాంతాలను పరిశీలించిన అనంతరం సంబంధిత శాఖల అధికారులు తక్షణ చర్యలు చేపట్టి సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సీపీ సూచించారు. ఈ పరిశీలనలో కరీంనగర్ రూరల్ ఇన్‌స్పెక్టర్ కె. నిరంజన్ రెడ్డి,ఎస్సై లక్ష్మారెడ్డి తదితర పోలీసు అధికారులు పాల్గొన్నారు.



## నేతన్నల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

– వ్యవసాయ, చేనేత జౌళి, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

–రూ.3.22 కోట్లతో రగుడు జంక్షన్ అభివృద్ధి పనుల ప్రారంభం

– నేత కార్మికులకు ఆర్డీ పాస్‌బుక్‌ల పంపిణీ










రాజన్న సిరిసిల్ల ప్రతినిధి, జూలై 30 (ప్రజాజ్యోతి): సిరిసిల్ల నేతన్నల సంక్షేమం, వస్త్ర పరిశ్రమ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని జిల్లా ఇంచార్జి, మార్కెటింగ్, వ్యవసాయ, చేనేత జౌళి, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. గురువారం సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని రగుడు వద్ద రూ. 3. 22 కోట్లతో చేపట్టిన జంక్షన్ అభివృద్ధి, సుందరీకరణ, మోడల్ బస్ షెల్టర్ల నిర్మాణ పనులను మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం ప్రారంభించారు. అనంతరం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో నిర్వహించిన కార్యక్రమంలో వస్త్ర పరిశ్రమ కార్మికులకు థ్రిఫ్ట్ ఫండ్ పథకానికి సంబంధించిన ఆర్డీ పాస్‌బుక్‌లను పంపిణీ చేశారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ సిరిసిల్ల చేనేతకు ప్రతీక అని, నేతన్నల కష్టానికి ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. గత రెండేళ్లలో చేనేత రంగానికి రూ. 1,360 కోట్లకు పైగా అందించామని తెలిపారు. ఏడాది పొడవునా ఉపాధి కల్పించడంతో పాటు భీమా, సంక్షేమ పథకాల అమలుకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. చేనేత ఉత్పత్తులకు మార్కెట్ కల్పించేందుకు ప్రభుత్వం నాణ్యమైన చీరలను కొనుగోలు చేస్తోందని, యార్న్ డిపో ఏర్పాటు ద్వారా సహకార సంఘాలకు మరింత ప్రయోజనం చేకూరుతుందని చెప్పారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తోందన్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా, ముఖ్యంగా సిరిసిల్ల అభివృద్ధికి ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తోందని, నేతన్నల సంక్షేమానికి మరిన్ని చర్యలు చేపడతామని పేర్కొన్నారు. రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ సిరిసిల్లలో నాణ్యమైన ఇందిరా మహిళా శక్తి చీరలు తయారవుతున్నాయని తెలిపారు. సిరిసిల్ల చీరలకు ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చేందుకు జీఐ ట్యాగ్ సాధన దిశగా కృషి చేయాలని సూచించారు. నేతన్నలకు ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వం వస్త్ర పరిశ్రమలో పేరుకపోయిన బకాయిలను దశలవారీగా చెల్లించి నేతన్నల్లో విశ్వాసం పెంచిందన్నారు. గత ఆర్థిక సంవత్సరంలో 6. 80 కోట్ల మీటర్ల చీరల ఉత్పత్తికి ఆర్డర్లు ఇవ్వగా, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 3 కోట్ల మీటర్ల చీరల తయారీకి ఆర్డర్లు జారీ చేసినట్లు తెలిపారు. ఇప్పటికే కోటి మీటర్ల ఉత్పత్తి పూర్తయిందని, రూ. 62 కోట్ల బిల్లులను చెల్లించామని చెప్పారు. రూ. 50 కోట్లతో యార్న్ బ్యాంక్, కామన్ ఫెసిలిటీ సెంటర్ ఏర్పాటుతో పాటు రగుడు జంక్షన్‌ను నేతన్నల వృత్తి ప్రతిబింబించేలా అభివృద్ధి చేస్తున్నామని వివరించారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ గుడి చెరువు బండ్ పార్క్‌ను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చామని తెలిపారు. రగుడు బైపాస్ జంక్షన్‌ను వస్త్ర తయారీ వివిధ దశలను ప్రతిబింబించేలా తీర్చిదిద్దామని చెప్పారు. గత ఏడాది జిల్లాలో తయారైన ఇందిరా మహిళా శక్తి చీరలకు విశేష ఆదరణ లభించిందని, ఈ ఏడాది కూడా ప్రభుత్వం ఆర్డర్లు ఇచ్చిందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం, ఎస్పీ మహేష్ బి. గితే, మున్నూరు కాపు కార్పొరేషన్ చైర్మన్ బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యానారాయణ గౌడ్, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ స్వరూప పాల్గొన్నారు.

## భారీ వర్షాల వేళ ప్రజలు అప్రమత్తంగా ఉండాలి -- పాడి ఉదయ్ నందన్ రెడ్డి

వీణవంక, జూలై 30 (ప్రజాజ్యోతి)తెలంగాణ రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని యుప్‌టీవీ ట్యూరిటో వ్యవస్థాపకుడు, సీఈఓ పాడి ఉదయ్ నందన్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ప్రజల ప్రాణాలు, ఆస్తుల రక్షణ కోసం ప్రభుత్వం, స్థానిక అధికారుల సూచనలను తప్పనిసరిగా పాటించాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అత్యవసరం అయితే తప్ప ప్రజలు బయటకు వెళ్లవద్దని, ముఖ్యంగా వరద నీరు ప్రవహిస్తున్న ప్రాంతాల్లో ప్రయాణాలను పూర్తిగా నివారించాలని సూచించారు. నదులు, వాగులు, చెరువుల సమీపానికి వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, నీటి మట్టం ఆకస్మికంగా పెరిగే ప్రమాదం ఉంటుందని హెచ్చరించారు. విద్యుత్ స్తంభాలు, తెగిపోయిన విద్యుత్ తీగల సమీపంలో తిరగవద్దని, పాత లేదా శిథిలావస్థలో ఉన్న ఇళ్లలో నివసించే వారు అవసరమైతే సురక్షిత ప్రాంతాలకు తరలిపోవాలని సూచించారు. చిన్నారులను వరద నీటిలో ఆడనివ్వకుండా తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అన్నారు. అలాగే నీరు నిలిచిన రహదారులపై వాహనాలు నడపడం ప్రమాదకరమని పేర్కొంటూ, అలాంటి మార్గాలను వీలైనంత వరకు నివారించాలని కోరారు. ఏదైనా అత్యవసర పరిస్థితి ఎదురైతే వెంటనే స్థానిక అధికారులను లేదా అత్యవసర సేవలైన 108 అంబులెన్స్, 100 పోలీస్ హెల్ప్‌లైన్‌ను సంప్రదించాలని ప్రజలకు సూచించారు. ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉంటూ, జాగ్రత్తలు పాటిస్తే ప్రాణనష్టం, ఆస్తి నష్టాన్ని గణనీయంగా తగ్గించవచ్చని పాడి ఉదయ్ నందన్ రెడ్డి పేర్కొన్నారు.



# రూ.180 కోట్ల అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ టెండర్‌పై సమగ్ర విచారణ జరపాలి

## – మాజీ మేయర్ సర్దార్ రవీందర్ సింగ్



కరీంనగర్ కలెక్టరేట్, జూలై 30 (ప్రజాజ్యోతి): కరీంనగర్ నగరంలో రూ. 180 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనుల టెండర్ ప్రక్రియపై సమగ్ర విచారణ జరిపించాలని మాజీ మేయర్, రాష్ట్ర సివిల్ సప్లయ్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్, 58వ డివిజన్ కార్పొరేటర్ సర్దార్ రవీందర్ సింగ్ డిమాండ్ చేశారు. గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ టెండర్ ప్రక్రియలో పారదర్శకత లోపించిందని ఆరోపించారు. రూ. 40 నుంచి రూ. 50 కోట్ల వరకు అక్రమ లావాదేవీలు జరిగాయనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయని, కేవలం కమిషన్ల కోసమే కాంట్రాక్టర్లకు అనుకూలంగా వ్యవహరించారనే ఆరోపణలు వస్తున్నాయని అన్నారు. ఈ అంశాలపై ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపించి వాస్తవాలను ప్రజల ముందుంచాలని కోరారు. గతంలో ఎక్సెస్ టెండర్‌ను రద్దు చేసి, తిరిగి అదే కాంట్రాక్టర్‌కు పనులు ఎలా అప్పగించారో ప్రభుత్వం వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. రూ. 50 లక్షల విలువైన పనులకు ఒక నిబంధన, రూ. 180 కోట్ల పనులకు మరో నిబంధన అమలు చేస్తున్నారా అని ప్రశ్నించారు. జీఓ నెం. 745 అమలు వెనుక ఉన్న కారణాలను కూడా బహిర్గతం చేయాలని కోరారు. స్మార్ట్ సిటీ కింద గతంలో చేపట్టిన డ్రైనేజీ పనుల నాణ్యత, ఇన్‌స్పెక్షన్ ఛాంబర్లు, ఇంటర్నల్ కనెక్షన్లు, ప్రధాన డ్రైనేజీ లింకులపై సమీక్ష జరపకుండానే మళ్లీ అదే సంస్థకు పనులు అప్పగించడం పలు అనుమానాలకు తావిస్తోందని పేర్కొన్నారు. గతంలో ఇదే సంస్థపై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ చేసిన ఆరోపణలపై కూడా ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. నగరంలో ఇప్పటికే ఉన్న సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ల (ఎస్‌టీపీ) సామర్థ్యం, వాటి పనితీరు, కొత్త ప్రాజెక్టుతో వాటి అనుసంధానంపై పూర్తి వివరాలను వెల్లడించాలని కోరారు. రూ. 180 కోట్ల ప్రాజెక్టు అమలుకు ముందు గతంలో చేపట్టిన పనులపై సమగ్ర సాంకేతిక పరిశీలన నిర్వహించాలని సూచించారు. కాంగ్రెస్, బీజేపీ నాయకుల మధ్య కుమ్మక్కు ఉందనే అనుమానాలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయని ఆరోపించిన సర్దార్ రవీందర్ సింగ్, టెండర్ ప్రక్రియను పూర్తిగా పారదర్శకంగా నిర్వహించి అన్ని వివరాలను బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. టెండర్ ప్రక్రియలో అవకతవకలు జరిగాయని తేలితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, అవసరమైతే ప్రజల తరపున న్యాయస్థానాన్ని ఆశ్రయించి న్యాయపోరాటం చేస్తామని ఆయన హెచ్చరించారు.

# శిథిలావస్థలో కాల్వ శ్రీరాంపూర్ ప్రభుత్వ ఆసుపత్రి.




## – వాన కొడితే బొల బొల. ఎండ కొడితే గలగల.
## – ప్రభుత్వాలు. పాలకులు మారిన. మారని ఆసుపత్రి ఆదుస్థితి.

కాల్వ శ్రీరాంపూర్ జూలై 30 ( ప్రజా జ్యోతి) కాల్వ శ్రీరాంపూర్ మండల కేంద్రంలో రోగులకు వైద్యం చేసి బాగు చేయాలనే ఉద్దేశంతో కోట్లాది రూపాయలు వెచ్చించి సుమారు 60 సంవత్సరాల క్రితం నిర్మించిన సర్కార్ దావకాన శిథిల వ్యవస్థకు చేరి పలు అనారోగ్య కారణాలతో వైద్యం కోసం వెళ్లే రోగులు తీవ్ర ఇబ్బందులకు గురికావాల్సి వస్తుందని చికిత్స కోసం వచ్చే రోగులు. వైద్యం అందించే డాక్టర్లు. ఆవేదన వ్యక్తం చేస్తున్నారు . వర్షాలకు పైకప్పు నుండి నీళ్లు బెడ్లపై పడడంతో రోగులు ఎప్పుడు కూలుతుందోనని బెడ్డుకు ఉండలేక పోతున్నారు. వర్షం కురిస్తే ఆసుపత్రి నిండా నీళ్లు. చేరుతున్నాయి. ఎండాకాలం గలగల వానకాలం బొల బొల అన్న సందంగ మారింది. గత ఏళ్ల నుండి ఈ దుస్థితి కొనసాగుతూనే ఉంది. ప్రభుత్వాలు మారిన. పాలకులు మారిన. చూస్తూ ఏమి పట్టనట్లు వ్యవహరిస్తున్నారని . పేరుకు 30 పడకల ఆసుపత్రి కానీ ఏమీ లేదని . పలువురు విమర్శిస్తున్నారు. గత్యంతరం లేక రోగులు వైద్యం కోసం పెద్దపెల్లి కరీంనగర్ పట్టణాలకు వెళ్లి లక్షల రూపాయలు ఖర్చు చేయవలసి వస్తుందని. దీంతో ఆర్థికంగా తీవ్రంగా నష్టపోతున్నామని వాపోతున్నారు. ఆసుపత్రుల బాగు కొరకు ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చిస్తున్నామని చెప్పినప్పటికీ . ఈ ఆసుపత్రి గురించి పట్టించుకోవడం లేదని . పలువురు విమర్శిస్తున్నారు . దీనితో గత ఏళ్ల నుండి ఈ దుస్థితిని అనుభవిస్తూనే ఉన్నామని పలువురు రోగులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు. ప్రజాప్రతినిధులు . చర్య తీసుకొని . నూతన ఆసుపత్రి నిర్మాణానికి నిధులు మంజూరు. చేయాలని. ఆయా గ్రామాల ప్రజలు ప్రజాప్రతినిధులు తదితరులు కోరుతున్నారు.





# పెద్దపల్లి బస్సు డిపో పనులు దసరా నాటికి పూర్తి

## ప్రజల చిరకాల ఆకాంక్ష నెరవేరనుంది: ప్రభుత్వ విప్ చింతకుంట విజయరమణరావు



పెద్దపల్లి, ప్రతినిధి జూలై 30 ప్రజాజ్యోతి : పెద్దపల్లి జిల్లా కేంద్రంలో నిర్మాణంలో ఉన్న తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఆర్టీసీ) నూతన బస్సు డిపో పనులను ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ నాగిరెడ్డితో కలిసి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా పనుల పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకుని, దసరా నాటికి డిపోను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయరమణరావు మాట్లాడుతూ, పెద్దపల్లి ప్రజల ఎన్నో ఏళ్ల చిరకాల ఆకాంక్ష అయిన బస్సు డిపో ఏర్పాటుకు తమ ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందన్నారు. గత ప్రభుత్వ హయాంలో జిల్లా కేంద్రంగా, రెవెన్యూ డివిజన్‌గా ఉన్నప్పటికీ బస్సు డిపో ఏర్పాటు చేయకపోవడం విచారకరమని విమర్శించారు. తాను ఎమ్మెల్యేగా ఎన్నికైన అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి ఈ అంశాన్ని తీసుకెళ్లగా, ప్రజల అవసరాన్ని గుర్తించి 2024 డిసెంబరులో నిర్వహించిన యువ వికాసం బహిరంగ సభలో పెద్దపల్లి బస్సు డిపోను మంజూరు చేశారని తెలిపారు. ప్రస్తుతం నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయని, దసరా నాటికి పూర్తి చేసి ప్రారంభించేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి తెలిపారని పేర్కొన్నారు. డిపో ప్రారంభంతో పెద్దపల్లి నియోజకవర్గ ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు అందుబాటులోకి రావడంతో పాటు కొత్త బస్సు సర్వీసులు పెరిగే అవకాశముందని ఎమ్మెల్యే తెలిపారు. పరిశీలన కార్య క్రమంలో పెద్దపల్లి మున్సిపల్ చైర్మన్, ఆర్టీసీ అధికారులు, మున్సిపల్ వైస్ చైర్మన్, కౌన్సిలర్లు, వివిధ గ్రామాల సర్పంచులు, సింగిల్ విండో చైర్మన్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి హోదా పొందిన. ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు కు ఘన సన్మానం.



కాల్వ శ్రీరాంపూర్ జూలై 30 (ప్రజాజ్యోతి) ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావుకు. ప్రభుత్వం మంత్రి హోదా కల్పించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ. కాల్వ శ్రీరాంపూర్ మండల కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గా జన వేణ. సదయ్య. ఓదెల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు . ప్రేమ్ సాగర్ రెడ్డి . మాజీ సర్పంచ్ మాదాసి సతీష్ తోపాటు. పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు తన గృహంలో గురువారం రోజున కలిసి. శాలువా. పూల మాలలతో ఘనంగా సత్కరించారు. ఆయనకు మంత్రి హోదా కల్పించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకరించిన మంత్రి వర్యులకు . వారు కృతజ్ఞతలు తెలిపారు . ఈ కార్యక్రమంలో మీర్జంపేట్ గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు . ఉయ్యాల శ్రీధర్. కెక్కర్ల తిరుపతి. బొడ్డుపల్లి మల్లేష్. స్వామి. బొడ్డుపల్లి సాయికిరణ్. తదితరులు పాల్గొన్నారు.

# ఆగస్టు 4న జాబ్ మేళా

**– జిల్లా ఉపాధి కల్పనాధికారి ఎం. రాజశేఖర్**



**పెద్దపల్లి, ప్రతినిధి జూలై – 30 ప్రజా జ్యోతి:** జిల్లాలోని నిరుద్యోగ యువతీ, యువకులకు హారే కృష్ణ మూవ్‌మెంట్ చారిటీస్ ఫౌండేషన్ లో ఉద్యోగాలు కల్పించుటకు ఆగస్టు 4 మంగళవారం రోజున జిల్లా ఉపాధి కల్పనాధికారి కార్యాలయంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి ఎం. రాజశేఖర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. హారే కృష్ణ మూవ్‌మెంట్ చారిటీస్ ఫౌండేషన్ సంస్థలో మంథని ప్రాంతంలో పనిచేయుటకు మొత్తం 72 ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని, ఇందులో ఆపరేషన్ మేనేజర్ 1, ప్రొడక్షన్ మేనేజర్ 2, ప్రొడక్షన్ ఎగ్జిక్యూటివ్ 5, డిస్ట్రిబ్యూషన్ ఇన్ చార్జ్ 4, డిస్ట్రిబ్యూషన్ ఎగ్జిక్యూటివ్ 8, మెయింటెనెన్స్ ఇన్ చార్జ్ 2, మెయింటెనెన్స్ ఎగ్జిక్యూటివ్ 6, స్టోర్ ఇంచార్జ్ 3, స్టోర్ ఎగ్జిక్యూటివ్ 8, క్వాలిటీ ఇంచార్జ్ 3, క్వాలిటీ ఎగ్జిక్యూటివ్ 4, క్వాలిటీ జూనియర్ ఎగ్జిక్యూటివ్ 8, కుక్స్/చెఫ్స్ 10, ఐటీ ఎగ్జిక్యూటివ్ 3, ప్రొక్యూర్‌మెంట్/పర్చేస్ 2, అకౌంట్స్ 2, హెచ్‌ఆర్ ఎగ్జిక్యూటివ్ 1 ఉద్యోగాలు ఖాళీలు ఉన్నాయని తెలిపారు. సంబంధిత ఉద్యోగాలకు విద్యార్హతలు పదవ తరగతి, డిగ్రీ ,డిప్లొమా, బిటెక్, ఎంటెక్ ,మెకానికల్, ఎలక్ట్రికల్ , మార్కెటింగ్ ,కంప్యూటర్ సైన్స్, బ్యాచిలర్ డిగ్రీ ఇన్ ఫుడ్ టెక్నాలజీ ,హోటల్ , హాస్పిటలిటీ, ఎంబీఏ పూర్తిచేసిన వయస్సు, అనుభవం కలిగిన పురుష అభ్యర్థులు అర్హులని,ఆసక్తి గల అభ్యర్థులు ఆగస్టు 04 మంగళవారం రోజున ఉదయం 11 గంటలకు అప్‌డేట్ చేసిన సివి/రెజ్యూమ్, విద్యార్హత పత్రాల జిరాక్స్ కాపీలు, ఆధార్ కార్డు జిరాక్స్, అనుభవ ధృవీకరణ పత్రం తీసుకుని సమీకృత జిల్లా కలెక్టర్ కార్యాలయం మొదటి అంతస్తులోని రూమ్ నెం. 233 జిల్లా ఉపాధి కల్పనాధికారి కార్యాలయం)కు వచ్చి తమ పేర్లను నమోదు చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 9908674056, 8985336947, 8121262441 నంబర్లలో సంప్రదించాలని జిల్లా ఉపాధి అధికారి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# ఎస్ఐఆర్ 100% పూర్తి చేసిన హిమ్మత్ నగర్

**బిఎల్ఓ లను అభినందించిన సర్పంచ్ బిర్ల ఆనందం.**



**గంగాధర జూలై 30: (ప్రజా జ్యోతి)** మండలంలోని హిమ్మత్నగర్ గ్రామ పంచాయతీ పరిధిలో ఎస్ఐఆర్ కార్యక్రమం 100 శాతం పూర్తయిన సందర్భంగా గురువారం పంచాయతీ పాలకవర్గం ఆధ్వర్యంలో అభినందన సభ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని దిగ్విజయంగా పూర్తి చేసిన బీఎల్వోలు విజయ, శంకరమ్మలతో పాటు జీపీవో మల్లయ్యలను సర్పంచ్ బిర్ల ఆనందం, ఉప సర్పంచ్ వెంకటేశ్, కార్యదర్శి మమత సత్కరించారు. విధుల నిర్వహణలో సహకరించిన గ్రామ ప్రజలకు సర్పంచ్ ఆనందం కృతజ్ఞతలు తెలియజేశారు.

# వర్షాకాలంలో అంటువ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

**–వేడి చేసి చల్లార్చిన నీరే తాగాలి**

**–అనవసర ప్రయాణాలు వాయిదా వేసుకోవాలి**

**– జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వై. పవిత్ర**



**పెద్దపల్లి ప్రతినిధి, జూలై 30 (ప్రజాజ్యోతి):** జిల్లాలో గత కొన్ని రోజులుగా కురుస్తున్న నిరంతర వర్షాల కారణంగా అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వై. పవిత్ర సూచించారు. వైద్య ఆరోగ్యశాఖ చేపడుతున్న ఆరోగ్య అవగాహన కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకుని అంటువ్యాధుల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు ఈగలు, దోమలు పెరగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈగల ద్వారా కలరా, టైఫాయిడ్, రక్త విరోచనాలు, నీళ్ల విరోచనాలు వంటి వ్యాధులు, దోమల ద్వారా మలేరియా, ఫైలేరియా, డెంగ్యూ, చికున్‌గున్యా, మెదడువాపు వంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ వ్యాధుల లక్షణాలు కనిపించిన వెంటనే సమీప ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో రక్త పరీక్షలు చేయించుకుని తగిన చికిత్స పొందాలని సూచించారు. ప్రజలు తప్పనిసరిగా వేడి చేసి చల్లార్చిన నీటిని మాత్రమే తాగాలని, వేడి ఆహార పదార్థాలనే తీసుకోవాలని సూచించారు. వర్షాల కారణంగా చిన్నారులు, వృద్ధులు అనవసర ప్రయాణాలు చేయకుండా ఉండాలని తెలిపారు. గర్భిణీలు ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు, వైద్య సిబ్బంది సహకారంతో ముందుగానే ప్రభుత్వ ఆసుపత్రులకు చేరుకుని ప్రభుత్వ వైద్యుల పర్యవేక్షణలో సురక్షిత ప్రసవాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. మరికొన్ని రోజులు వర్షాలు కొనసాగే అవకాశం ఉన్నందున ప్రయాణాలకు అంతరాయం ఏర్పడి ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశముందని, అత్యవసరం కాని ప్రయాణాలను వాయిదా వేసుకోవాలని సూచించారు. వైద్య ఆరోగ్యశాఖ అందిస్తున్న సేవలపై ప్రజలు అవగాహన పెంచుకుని ఆరోగ్యవంతమైన జీవనం సాగించాలని తెలిపారు. జిల్లాలో ఆశా కార్యకర్తల నుంచి వైద్యాధికారుల వరకు అందరూ అప్రమత్తంగా ఉండి సమన్వయంతో ప్రజలకు వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. ప్రస్తుతం వర్షాల పరిస్థితుల దృష్ట్యా సాధారణ సెలవులు మంజూరు చేయడం లేదని, ప్రతి ఉద్యోగి తనకు కేటాయించిన ప్రధాన కార్యాలయంలోనే అందుబాటులో ఉండి విధులు నిర్వహించాలని స్పష్టం చేశారు. విధుల్ నిర్లక్ష్యం వహించిన వారిపై సీసీఏ నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వై. పవిత్ర హెచ్చరించారు.

# గంగాధర పోలీస్ స్టేషన్ను వార్షిక తనిఖీ చేసిన కరీంనగర్ పోలీస్ కమీషనర్ గౌష్ ఆలం



**గంగాధర జూలై 30: (ప్రజా జ్యోతి):** కరీంనగర్ కమిషనరేట్ పరిధిలోని గంగాధర పోలీసు స్టేషన్ ను గురువారం కరీంనగర్ పోలీస్ కమీషనర్ గౌష్ ఆలం వార్షిక తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్ కు విచ్చేసిన కమీషనర్ కు స్టేషన్ ఎస్సై వంశీకృష్ణ పూల మొక్కను అందించి స్వాగతం పలికారు. అనంతరం సాయుధ దళ పోలీసుల గార్డ్ అందించిన గౌరవ వందనం స్వీకరించారు. పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. అనంతరం పోలీస్ స్టేషన్ ఆవరణలో పలు కేసుల్లో పట్టుబడి స్వాధీనంలో ఉన్న వాహనాల వివరాలు అడిగారు. పోలీస్ స్టేషన్ లో హాజరులో ఉన్న సిబ్బందితో మాట్లాడి, వారికి కేటాయించబడిన విధుల గురించి అడిగి తెలుసుకున్నారు. సరైన పద్ధతిలో రికార్డుల నిర్వహణ, నమోదైన కేసుల వివరాలు సీసీటీఎన్ఎస్ లో పొందుపరచాలని సూచించారు .తెలంగాణ పోలీసులు టెక్నాలజీ వినియోగంలో భాగంగా ఉపయోగించే సీసీటీఎన్ఎస్ – 2.0, పిటిషన్ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌లో ఈ–సమన్ల జారీ మరియు అమలు, టీఎస్–కాప్, హెచ్ఆర్ఎంఎస్, ఈ–సాక్ష్య, టెక్ డాటం, ఐరాడ్, దర్పణ్, సీఈఐఆర్, సైబర్ క్రైమ్‌లో ఆర్థిక మరియు ఆర్థికేతర నేరాల సమాచారం, సీడీఆర్ వంటి అన్ని రకాల సాఫ్ట్‌వేర్/అప్లికేషన్‌లపై పూర్తి స్థాయిలో పట్టు సాధించి, వాటిని రోజువారీ విధుల్లో విరివిగా వినియోగించాలన్నారు. పోలీస్ స్టేషన్ కి కేటాయించబడిన పరికరాలను, అలాగే పోర్టబుల్ ఫింగర్ ప్రింట్ డివైస్ ను బ్లూ కోల్ట్స్ సిబ్బంది వినియోగించే తీరును పరిశీలించారు. ఎఫ్.ఐ.ఆర్ ఇండెక్స్ ని పరిశీలించి, పెండింగ్ కేసులపై సమీక్ష జరిపారు. కేసుల ఆలస్యానికి గల కారణాలు తెలుసుకుని, త్వరితగతిన ఇన్వెస్టిగేషన్ పూర్తి చేయాలని ఆదేశించారు. నమోదైన సైబర్ నేరాల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. విజిబుల్ పోలీసింగ్ పై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. గంగాధర పోలీసు స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాలను సెక్టార్లుగా, సబ్ సెక్టార్లుగా విభజించి వాటికి గ్రామ పోలీసు అధికారులను కేటాయించాలని స్పష్టం చేశారు.రౌడీ షీటర్లు, హిస్టరీ షీటర్లపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి వారి కదలికలను ఎప్పటికప్పుడు గమనించాలన్నారు. ప్రతి నెల వారికి సంబంధించిన నూతన సమాచారాన్ని సేకరించి రికార్డుల్లో నమోదు చేసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రూరల్ ఏసీపీ విజయకుమార్, చొప్పదండి సర్కిల్ ఇన్స్పెక్టర్ ప్రదీప్ కుమార్, గంగాధర ఎస్సై వంశీకృష్ణలతో పాటు ఇతర అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.



# గాయత్రి డిగ్రీ, పీజీ కళాశాలలో ఘనంగా బోనాలు గోరింట సంబరాలు

**– సాంప్రదాయ వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థినులు, అధ్యాపకులు**




**పెద్దపల్లి ప్రతినిధి, జూలై 30 (ప్రజాజ్యోతి):** పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని గాయత్రి డిగ్రీ & పీజీ కళాశాలలో గురువారం బోనాలు, గోరింట సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గాయత్రి విద్యానికేతన్ కరస్పాండెంట్ శ్రీమతి అల్లెంకి రజిని శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై బోనం ఎత్తుకుని అమ్మవారికి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించి నైవేద్యం సమర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, బోనాలు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే వైభవోపేతమైన జానపద పండుగ అని అన్నారు. అమ్మవారికి అన్నం, పెరుగు, బెల్లం తదితర నైవేద్యాలతో బోనం సమర్పించడం ద్వారా భక్తులు తమ విశ్వాసాన్ని చాటుకుంటారని తెలిపారు. గ్రామాలు, పట్టణాల్లో అమ్మవారి ఆలయాలను ప్రత్యేకంగా అలంకరించి, మహిళలు సాంప్రదాయ వస్త్రధారణలో తలపై బోనాలు ఎత్తుకుని ఊరేగింపుగా వెళ్లడం ఈ పండుగ విశిష్టత అని వివరించారు. గోరింటాకు మన సంస్కృతిలో విడదీయరాని భాగమని, ముఖ్యంగా ఆషాఢ మాసంలో మహిళలు చేతులకు గోరింటాకు అలంకరించుకోవడం ఆనవాయితీ అని పేర్కొన్నారు. గోరింటాకు శరీరానికి చల్లదనాన్ని అందించడంతో పాటు శుభానికి ప్రతీకగా భావిస్తారని తెలిపారు. ఈ సందర్భంగా కళాశాలలో స్వయంగా గోరింటాకు రుబ్బి విద్యార్థినులు, అధ్యాపకురాళ్లు ఒకరికొకరు గోరింటాకు పెట్టుకుని బోనాల పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. సాంప్రదాయ దుస్తుల్లో పాల్గొన్న విద్యార్థినులు సాంస్కృతిక కార్యక్రమాలతో వేడుకలకు మరింత శోభను తీసుకువచ్చారు.

# 12 గంటల్లోనే ఇద్దరు బాలికల ఆచూకీ.. డిసిపి రామ్ రెడ్డి





**సుల్తానాబాద్, జూలై 30: (ప్రజా జ్యోతి)** సుల్తానాబాద్ పట్టణంలోని మార్కండేయ కాలనీలోని బాలసదన్ చిల్డ్రన్ హోమ్ నుంచి తప్పిపోయిన ఇద్దరు మైనర్ బాలికలను పోలీసులు కేవలం 12 గంటల్లోనే సురక్షితంగా గుర్తించి రక్షించారు. పెద్దపల్లి డీసీపీ భూక్య రామ్ రెడ్డి ఆదేశాల మేరకు నాలుగు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి గాలింపు చేపట్టారు. సీసీటీవీ ఫుటేజ్, సాంకేతిక ఆధారాల విశ్లేషణతో బాలికలు సుల్తానాబాద్ నుంచి పెద్దపల్లి రైల్వే స్టేషన్, అక్కడి నుంచి భువనగిరి మీదుగా నల్గొండకు వెళ్లినట్లు గుర్తించి, నల్గొండ బస్టాండ్‌లో సురక్షితంగా రక్షించారు. అనంతరం చట్టపరమైన ప్రక్రియ పూర్తి చేసి సంబంధిత అధికారులకు అప్పగించారు. ఈ ఆపరేషన్‌లో సీఐ పొన్నమనేని రంజిత్‌రావు, ఎస్సై చంద్రకుమార్, పోలీసు సిబ్బంది, టెక్నికల్ టీమ్ సమన్వయంతో పనిచేసినట్లు డీసీపీ తెలిపారు. బాలికలను వేగంగా గుర్తించి రక్షించడంలో విశేష కృషి చేసిన ఒక కానిస్టేబుల్‌కు డీసీపీ నగదు రివార్డు అందజేసి అభినందించారు. పోలీసు బృందం అప్రమత్తత, సమన్వయంతో వ్యవహరించడంతో తక్కువ సమయంలోనే బాలికలను క్షేమంగా గుర్తించడం సాధ్యమైందని పేర్కొన్నారు. ఈ ఘటనలో పోలీసుల వేగవంతమైన చర్యలను స్థానిక ప్రజలు, ప్రజాప్రతినిధులు, చైల్డ్ వెల్ఫేర్ అధికారులు ప్రశంసించారు. మైనర్ బాలికల గోప్యత దృష్ట్యా వారి గుర్తింపు వివరాలను వెల్లడించడం లేదని పోలీసులు తెలిపారు.

# మామిడిపల్లి లో మూలవాగు ఉధృతికి కొట్టుకుపోయిన వంతెన

**–ప్రతి ఏటా ప్రజల రాకపోకలకు తప్పని తిప్పలు**

**– వంతెనను పరిశీలించిన బిజెపి మండల నాయకులు**



**కోనరావుపేట, జూలై.30(ప్రజాజ్యోతి)**గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు కోనరావుపేట మండల పరిధిలోని నిజామాబాద్ మామిడిపల్లి మధ్యగల మూలవాగు రహదారి తెగిపోవడంతో రాకపోకలు పూర్తిగా స్తంభించిపోగ విషయం తెలుసుకున్న బిజెపి మండల అధ్యక్షులు మిర్యాల్ కార్ బాలాజీ, నాయకులతో కలిసి కొట్టుకుపోయిన వంతెనను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. వర్షాల దృశ్య ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని కోరారు. రహదారి తెగిపోవడంతో స్థానిక రైతులు గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వంతెనలు కొట్టుకుపోవడం అధికారులు తాత్కాలిక మరమ్మతులతోనే సరిపెట్టడం జరుగుతుందని. శాశ్వత వంతెన ఆ గ్రామానికి కలగానే మిగిలిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో శాశ్వత పరిష్కారం చూపిస్తామని హామీ ఇచ్చిన నాయకులు పత్తలేకుండా పోయారని వాపోయారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పూర్తిస్థాయిలో వంతెన నిర్మాణం చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల ప్రధాన కార్యదర్శి బైరగొని సురేష్ గౌడ్, ఎక్కలదేవి జలంధర్, కోశాధికారి వేల్పుల తిరుపతి, సోషల్ మీడియా కన్వీనర్ లంబ వేణు, సీనియర్ నాయకులు మాదాసు మల్లేశం, గడ్డం తిరుపతిరెడ్డి, గాజుల రాజు, తదితరులు పాల్గొన్నారు.

## బారి వర్షాల కారణంగా అత్యవసర నియంత్రణ గది ఏర్పాటు తహసీల్దార్




**ఇల్లంతకుంట జూలై 30 (ప్రజజ్యోతి)** భారీ వర్షాల దృష్ట్యా రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండల తహసీల్దార్ కార్యాలయంలో “అత్యవసర నియంత్రణ గది (జుఎవతీస్త్రవఅఎఎ జశీఅతీశీశ్రీ =శీశీఎ)” ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ సురేష్ తెలిపారు ప్రజలకు ? ఎలాంటి అత్యవసర పరిస్థితి ఎదురైనా, వరద సహాయం లేదా సమాచారం కోసం క్రింది హెల్ప్‌లైన్ నంబర్ 9963782919 ను సంప్రదించగలరనీ తెలిపారు

## చోరీ కేసులో మరో నిందితురాలు అరెస్ట్




**కరీంనగర్ క్రైం, జూలై 30, (ప్రజాజ్యోతి):** కరీంనగర్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన రూ. 26 లక్షల భారీ చోరీ కేసులో మరో నిందితురాలిని పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. ఇప్పటికే ఈ కేసులో ప్రధాన నిందితుడైన తగరం శంకర్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించగా తాజాగా అతని సన్నిహితురాలు ఆడెపు రేష్మా పోలీసులకు చిక్కింది. కరీంనగర్ రూరల్ సీఐ ఏ. నిరంజన్ రెడ్డి తెలిపిన సమాచారం మేరకు గురువారం మధ్యాహ్నం తీగలగుట్టపల్లి రైల్వే స్టేషన్‌లో అనుమానాస్పదంగా సంచరిస్తున్న మహిళను అదుపులోకి తీసుకుని విచారించారు. ఆమె కేశవపట్నం మండలం చింతగుట్టపల్లి గ్రామానికి చెందిన ఆడెపు రేష్మాగా గుర్తించారు. ప్రధాన నిందితుడు తగరం శంకర్‌తో కలిసి ఫారెస్ట్ అధికారి శ్రీనివాస్ ఇంటిలోకి ప్రవేశించి ఇంటి తాళాలు పగులగొట్టి, బాత్రూమ్‌లో ప్లాస్టిక్ డ్రమ్ములో దాచిన సుమారు రూ. 26 లక్షల నగదును అపహరించినట్లు విచారణలో అంగీకరించింది. దొంగతనం తర్వాత తనకు నగదులో వాటా ఇస్తానని తగరం శంకర్ చెప్పాడని అయితే అతను స్వగ్రామానికి వెళ్లిపోవడంతో డబ్బు అందలేదని రేష్మా తెలిపింది. శంకర్ అరెస్ట్ అయిన విషయం పత్రికలు, టీవీ వార్తల ద్వారా తెలుసుకుని, తనను కూడా పోలీసులు పట్టుకుంటారనే భయంతో చంద్రాపూర్ వెళ్లేందుకు తీగలగుట్టపల్లి రైల్వే స్టేషన్‌కు వచ్చి రైలు కోసం వేచి ఉండగా పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు వెల్లడించింది. తగరం శంకర్‌తో మాట్లాడేందుకు ఉపయోగించిన మొబైల్ ఫోన్‌ను కూడా రేష్మా స్వచ్ఛందంగా పోలీసులకు అప్పగించింది. అనంతరం పంచనామా నిర్వహించి నిందితురాలిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు .కేసుకు సంబంధించి మరిన్ని వివరాలపై దర్యాప్తు కొనసాగుతోందని కరీంనగర్ రూరల్ సీఐ ఏ. నిరంజన్ రెడ్డి తెలిపారు.

## ఎర్రగుంటపల్లి రోడ్డు ప్రమాద కేసులో దోషికి శిక్ష

**– నిందితుడికి రెండేళ్ల జైలు శిక్ష, జరిమాన**

**ధర్మారం,జూలై 30(ప్రజా జ్యోతి న్యూస్):** ధర్మారం మండలంలోని ఎర్రగుంటపల్లి వద్ద 2020 మే 2న జరిగిన ఘోర రోడ్డు ప్రమాద కేసులో నిందితుడికి జైలు శిక్ష విధిస్తూ నంది మేడారం జూనియర్ సివిల్ జడ్జి కమ్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ (జీఎఫ్‌సీఎమ్) తీర్పు వెలువరించారు. కేసు వివరాల ప్రకారం, పైడిపల్లి గ్రామానికి చెందిన గంగుల రవీందర్ తన కారును అతివేగంగా,నిర్లక్ష్యంగా నడుపుతూ ఫిర్యాదుదారుడి తండ్రి ఎల్లాల రామ్‌రెడ్డిని ఢీకొట్టాడు. ఈ ప్రమాదం లో తీవ్రంగా గాయపడిన రామ్‌రెడ్డి అక్కడికక్కడే మృతి చెందా డు. ఘటనపై అప్పటి ధర్మారం ఎస్‌ఐ కె. ప్రేమ్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు పూర్తి చేసి చార్జిషీట్ దాఖలు చేశారు. ఈ కేసును విచారించిన జీఎఫ్‌సీఎమ్ మేజిస్ట్రేట్ నంది మేడారం న్యాయస్థానం సాక్షుల వాంగ్మూలాలు,ఆధారాలను పరిశీలించి నిందితుడు గంగుల రవీందర్‌ను దోషిగా తేల్చింది. నిందితుడికి రెండేళ్ల జైలు శిక్షతో పాటు రూ. 5,000 జరిమానా, అలాగే మోటార్ వెహికిల్స్ చట్టం కింద మూడు నెలల జైలు శిక్ష మరియు రూ. 2,000 జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చింది. ఈ కేసులో ప్రభుత్వ తరపున సమర్థవంతంగా వాదనలు వినిపించిన అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ (ఇన్‌ఛార్జ్) రాకేష్‌ను,అలాగే సాక్షులను సకాలంలో కోర్టులో హాజరుపరిచిన కోర్టు డ్యూటీ కానిస్టేబుల్ సంతోష్‌ను న్యాయమూర్తి ప్రత్యేకంగా అభినందిం చారు. ఈ వివరాలను ధర్మారం ఎస్‌ఐ ఎం. ప్రవీణ్ కుమార్ వెల్లడించారు.

## నిజామాబాద్. మామిడిపల్లి మూల వాగు వద్ద భారీకేడ్లు ఏర్పాటు



**కొనరావుపేట, జూలై.30(ప్రజాజ్యోతి)** గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా నిజామాబాద్, మామిడిపల్లి మూల వాగు వద్ద భారి వర్షాలకు రహదారి కొట్టుకుపోవడంతో ఆ మార్గంలో రాకపోకలను నిలిపివేశారు. కొనరావుపేట ఎస్సై కే ప్రశాంత్ రెడ్డి, ఆధ్వర్యంలో పోలీసులు సంఘటన స్థలం వద్ద భారీకేడ్లు ఏర్పాటు చేసి ప్రజలను వెనక్కి పంపించారు. దెబ్బతిన్న రహదారిపై ప్రయాణించకుండా ప్రత్యామ్నాయ మార్గాలను వినియోగించాలని వరద నీరు ప్రవహించే ప్రాంతాలను దాటేందుకు ప్రయత్నించవద్దని ఎస్ఐ సూచించారు. అలాగే వరద నీరు ప్రవహిస్తున్న ప్రాంతాలను దాటే ప్రయత్నం చేయవద్దని పోలీస్ అధికారులు మరియు సంబంధిత శాఖల సూచనలు తప్పనిసరిగా పాటించాలని కోరారు.

## వేములవాడలో అధ్యాత్మిక శోభ



**వేములవాడ,జూలై ,30: ప్ర జా జ్యోతి.** వే ము ల వా డ పట్టణం లో గురు వారం రోజు న మినీ ట్యాంక్ బండ్ ,పా ర్క్, మం త్రు లు, తు మ్మ ల .నాగేశ్వ రావు,పొ న్నం .ప్రభ ాకర్, అడ్లూరి. లక్ష్మన్, కూమార్,వేములవాడ ఎమ్మెల్యే ,,ప్రభుత్వవిప్,ఆది. శ్రీనివాస్,తోకలి సిప్రారంభించారు .మంత్రులుమాట్లాడుచూప్రజాప్రభుత్వంఎల్లవేళలారాష్ట్రఅభివృద్ధికొరకుకృషి చేస్తుందిఅన్నారు.వేములవాడపట్టణం,వేములవాడనియోజకవర్గం, ఆలయఅభివృద్ధికొరకుప్రభుత్వవిప్ఆది. శ్రీనివాస్,నిర్వీరరామముగ ాకృషిచేస్తున్నాడుఅనిమంత్రులుఅన్నారు,గతపదిసంవత్సరంలలోజ రగనిఅభివృద్ధిప్రజాప్రభుత్వంలోజరిగింది ప్రజలకుఆహ్లాదకరమైన వాతావరణాన్ని,పర్యాటకులకుఆకర్షణగానిలిచేలాఈప్రాంతంమరింతఅభివృద్ధిచెందదంసంతోషకరం,వేములవాడమరింతసుందరంగా,అభివృద్ధిపథంలోముందుకుదూసుపోతుంది అన్నారు

## వరద సహాయక చర్యలు ముమ్మరం చేయాలి : మంత్రి శ్రీధర్ బాబు

**– వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధికారులతో సమీక్ష..**

**– అప్రమత్తంగా ఉండాలని ఆదేశాలు**



**మంథని, జులై 30 (ప్రజాజ్యోతి):** గోదావరిఖని, పెద్దపల్లి, రామగుండం, మంథని ప్రాంతాల్లో రెండు రోజులుగా కురిసిన భారీ వర్షాల నేపథ్యంలో వరద సహాయక, పునరావాస చర్యలను యుద్ధప్రాతిపదికన చేపట్టాలని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అధికారులను ఆదేశించారు. డా. బీఆర్ అంబేద్కర్ సచివాలయం నుంచి గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన మంత్రి, పెద్దపల్లి జిల్లా కలెక్టర్, సింగరేణి సీఎండీ, ఎన్‌టీపీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, తెలంగాణ జెన్‌కో సీఎండీ, ఆర్‌ఎఫ్‌సీఎల్ అధికారులు, రామగుండం పోలీసు కమిషనర్‌తో పాటు పలువురు ఉన్నతాధికారులతో వరద పరిస్థితిపై సమీక్షించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట వెంకటరమణారావు, రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ కూడా పాల్గొన్నారు. రామగుండం పారిశ్రామికవాడలో నిలిచిపోయిన వరద నీటిని వెంటనే తొలగించి, నాలాల్లో ఉన్న అడ్డంకులను తొలగించాలని మంత్రి ఆదేశించారు. సింగరేణి, ఎన్‌టీపీసీ సంస్థలు జిల్లా యంత్రాంగానికి పూర్తి సహకారం అందిస్తూ సహాయక చర్యల్లో చురుకుగా పాల్గొనాలని సూచించారు. వీర్లపల్లి గ్రామంలోకి వరద నీరు ప్రవేశించకుండా ప్రత్యామ్నాయ మార్గాల్లో మళ్లించే చర్యలు చేపట్టాలని, గ్రామస్తులకు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం ఇంటి స్థలాల పట్టాల పంపిణీని వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్‌కు సూచించారు. గోదావరిఖనిలో వరద ప్రభావం అధికంగా ఉన్న నేపథ్యంలో మున్సిపల్, రెవెన్యూ శాఖలకు పోలీసులు పూర్తి సహకారం అందించాలని, ప్రధాన రహదారులపై ట్రాఫిక్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని రామగుండం పోలీసు కమిషనర్‌ను ఆదేశించారు. విపత్తు నివారణ బృందాలను పూర్తిస్థాయిలో రంగంలోకి దించి సహాయక చర్యలను వేగవంతం చేయాలని సూచించారు. పెద్దపల్లి జిల్లాలోని 1,021 చెరువుల్లో సుమారు 80 శాతం నీరు నిండిందని, దీంతో దాదాపు 2.7 లక్షల ఎకరాలకు సాగునీటి కొరత ఉండదని మంత్రి తెలిపారు. శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులో నీటి నిల్వలు 20 టీఎంసీలకు చేరనున్న నేపథ్యంలో నీటి మట్టాలను నిరంతరం పర్యవేక్షిస్తూ ఒక్క చుక్క నీరూ వృథా కాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వరద ప్రభావిత వీర్లపల్లి గ్రామంతో పాటు గోదావరిఖని, రామగుండం పారిశ్రామిక ప్రాంతాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, సింగరేణి అధికారులకు సూచించారు. స్థానిక ప్రజాప్రతినిధుల సూచనలను పరిగణనలోకి తీసుకుని ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అప్రమత్తంగా పనిచేయాలని పేర్కొన్నారు. వరద సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్న రామగుండం మేయర్, డిప్యూటీ మేయర్, కార్పొరేటర్ల సేవలను మంత్రి అభినందించారు.

## భారీ వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి

**– నంది పంప్ హౌస్ పరిశీలించిన పెద్దపల్లి సీఐ కె. ప్రవీణ్ కుమార్**



**ధర్మారం,జూలై 30(ప్రజా జ్యోతి న్యూస్):** ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ప్రజల భద్రతే ప్రధాన లక్ష్యంగా పోలీసులు అప్రమత్త చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా స్థానిక ధర్మారం ఎస్సై ప్రవీణ్ కుమార్ తో కలిసి పెద్దపల్లి సీఐ కె. ప్రవీణ్ కుమార్ గురువారం ధర్మారం మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించి, వాగులు,కల్వర్టులు, రహదారులతో పాటు మేడారం ప్రాంతంలోని నంది రిజర్వాయర్ ఏడూ పంపుల వద్ద వరద పరిస్థితులను ప్రత్యక్షంగా పరిశీలించారు. వరద ఉధృతి,రాకపోకల పరిస్థితిని స్థానిక పోలీసు సిబ్బంది,అధికారులను అడిగి తెలుసుకుని అవసరమైన జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ,వర్షాల కారణంగా వాగులు, వంకలు ప్రమాదకరంగా మారే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. అత్యవసర పరిస్థితులు మినహా వరద నీరు ప్రవహిస్తున్న వాగులు, కల్వర్టులు,రోడ్లను దాటే ప్రయత్నం చేయవద్దని సూచించారు. వాహనదారులు రహదారులపై నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో వేగంగా ప్రయాణించకుండా జాగ్రత్తగా వెళ్లాలని సూచించారు. అలాగే, వరద సమయంలో చేపలు పట్టేందుకు వాగులు, చెరువుల వద్దకు వెళ్లవద్దని, విద్యుత్ స్తంభాలు, తెగిపోయిన విద్యుత్ తీగల వద్దకు వెళ్లడం లేదా వాటిని తాకడం ప్రమాదకరమని హెచ్చరించారు. పాత ఇళ్లలో నివసిస్తున్న వారు అప్రమత్తంగా ఉండి అవసరమైతే సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని సూచించారు. ప్రజలకు ఎలాంటి అత్యవసర పరిస్థితులు ఎదురైనా వెంటనే డయల్ 100 లేదా 112కు సమాచారం అందించాలని,పోలీసు శాఖ ప్రజల రక్షణ కోసం 24 గంటలూ అందుబాటులో ఉంటుందని సీఐ కె. ప్రవీణ్ కుమార్ తెలిపారు. వరదల సమయంలో అధికారులు జారీ చేసే సూచనలు తప్పనిసరిగా పాటించి, ప్రాణ నష్టాలు జరగకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## దళితులను కించపరిస్తే చట్టరీత్యా నేరం

**– తహసిల్దార్ రా పెల్లి రాముడు.**

**కాల్వ శ్రీరాంపూర్ జూలై 30 (ప్రజాజ్యోతి)** దళితులను అంటరాని వారిగా కించపరిస్తే చట్టరీత్య తీవ్ర నేరంగా పరిగణించవలసి వస్తుందని తహసిల్దార్ డాక్టర్. రాపల్లి రాముడు సూచించారు. కాల్వ శ్రీరాంపూర్ మండలంలోని పెగడపల్లి గ్రామంలో గల రైతు వేదికలో అంటరానితనం నిర్మూలన కార్యక్రమాన్ని గురువారం రోజున నిర్వహించారు. చట్టాలపై ఎస్సై సుధాకర్ పలు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రమేష్. తదితరులు పాల్గొన్నారు.



# లో లెవెల్ బ్రిడ్జిలపై వరద ప్రవాహం..

**– రాకపోకలకు అంతరాయం.. పలు చోట్ల చెట్లు కూలివేత**





ధర్మారం, జూలై 30 (ప్రజా జ్యోతి న్యూస్):ధర్మారం మండలంలో గత మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలతో పలు గ్రామాల్లో సమస్యలు తలెత్తాయి. వాగులు,చెరువులు, కుంటలు జలకళను సంతరించుకోగా, లో లెవెల్ బ్రిడ్జిలపై వరద నీరు ప్రవహించడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.ఖిలావనపర్తి గ్రామంలోని పాత గ్రామపంచాయతీ కార్యాలయం సమీపంలో భారీ చెట్టు నేలకూలడంతో స్థానికులు ఆందోళనకు గురయ్యారు.సమాచారం అందుకున్న గ్రామ సర్పంచ్ మోతె కనకయ్య వెంటనే స్పందించి జేసీబీ సహాయంతో చెట్టును తొలగించి రాకపోకలను పునరుద్ధరించారు.రచ్చపల్లి--రామయ్యపల్లి గ్రామాల మధ్య ఉన్న లో లెవెల్ బ్రిడ్జిపై వరద ఉధృతి పెరగడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి.అలాగే కొత్తూరు--కటికెనపల్లి గ్రామాల మధ్య ఉన్న లో లెవెల్ బ్రిడ్జిపై కూడా వరద ప్రవాహం పోటెత్తడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.అధికారులు వరద నీరు తగ్గే వరకు బ్రిడ్జిలను దాటకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.న్యూ కొత్తపల్లి గ్రామంలో రోడ్డుపై భారీ చెట్టు విరిగి పడగా, గ్రామ సర్పంచ్ నందాల మల్లేశం పంచాయతీ సిబ్బందితో కలిసి చెట్టును తొలగించి రాకపోకలను సాఫీ చేశారు.ఇక ధర్మారం గ్రామంలోని ఊర చెరువు నిండు కుండలా మారి ఆకట్టుకుంటోంది.మండలంలోని పలు గ్రామాల్లో చిన్నచిన్న చెరువులు, కుంటలు,వాగులు నీటితో కళకళలాడుతున్నాయి. వరుస వర్షాలతో భూగర్భ జలాలు పెరిగే అవకాశం ఉండటంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నప్పటికీ, లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

# వేములవాడ బుడగ జంగాల కాలనీలో 30 కుటుంబాలను సురక్షిత ప్రాంతాలకు తరలింపు

**–లోతట్టు ప్రాంత ప్రజలకు హరిమల గార్డెన్‌లో పునరావాసం: మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు**

**– బుడగ జంగాల కాలనీని పరిశీలించిన చైర్మన్, ఆర్డీఓ,డీఎస్పీ, కమిషనర్**

**ఆపద వస్తే వెంటనే సమాచారం ఇవ్వండి: చైర్మన్ పుల్కం రాజు**



**వేములవాడ,జులై,30:ప్రజాజ్యోతి.** గత మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు వేములవాడ పట్టణంలోని లోతట్టు ప్రాంతాలు ప్రభావితమయ్యాయి. ముఖ్యంగా 13వ వార్డు పరిధిలోని కొనాయిపల్లి రోడ్డులో ఉన్న బుడగ జంగాల కాలనీని వర్ద నీరు చుట్టుముట్టడంతో కాలనీ పూర్తిగా జలమయమైంది. దీంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్న బాధితులను కాపాడేందుకు మున్సిపల్ యంత్రాంగం తక్షణమే రంగంలోకి దిగింది. వరద ముప్పు పెరిగే ప్రమాదం ఉండటంతో ముందస్తు భద్రతా చర్యల్లో భాగంగా దాదాపు 30 కుటుంబాలను మున్సిపల్ అధికారుల ఆధ్వర్యంలో సురక్షిత ప్రాంతానికి తరలించారు. తాత్కాలిక పునరావాస కేంద్రమైన హరిమల గార్డెన్‌కు తరలించి ప్రాథమిక వసతులను కల్పించారు.అయితే ?పరిస్థితిని తెలుసుకున్న వేములవాడ మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, ఆర్డీఓ ఎస్.కె.బి. కుమారి, డీఎస్పీ శ్రీనివాసులు, మున్సిపల్ కమిషనర్ లోకేష్‌లతో కలిసి జలమయమైన 13వ వార్డు కాలనీ ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం హరిమల గార్డెన్‌లోని పునరావాస కేంద్రాన్ని సందర్శించి బాధితులకు కల్పిస్తున్న ఏర్పాట్లను సమీక్షించారు. వర్షాల ఉధృతి దృష్ట్యా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు, ప్రాణనష్టం జరగకుండా ఉండేందుకే కాలనీవాసులను సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు పుల్కం రాజు పేర్కొన్నారు. లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తూ, ప్రతికూల వాతావరణంలో అధికారులు ఎల్లవేళలా అందుబాటులో ఉంటారని ధైర్యాన్నిచ్చారు. ఏదైనా అత్యవసర పరిస్థితి లేదా ప్రమాదం ఎదురైతే తక్షణమే మున్సిపల్ సిబ్బందికి లేదా పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వేములవాడ పట్టణ సీఐ వీరప్రసాద్, తహసిల్దార్ జయంత్, మున్సిపల్ మేనేజర్ సంపత్ రెడ్డి, టిబిపిఓ వినోద్, శానిటేషన్ ఇన్స్పెక్టర్ సుకుమార్, మున్సిపల్, రెవిన్యూ, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు..

# తెలంగాణ జలసిరి పథకంపై అవగాహన కార్యక్రమం నిర్వహణ

**నీటి సంరక్షణలో ప్రజల భాగస్వామ్యం అవసరం -- డీఆర్‌డీఓ అధికారి గీత**





**వీణవంక, జూలై 30 ( ప్రజాజ్యోతి )** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న "తెలంగాణ జలసిరి" పథకంపై ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమం వీణవంకలో నిర్వహిం చారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డీఆర్‌డీఓ అధికారి గీత జలసిరి పథకం ద్వారా గ్రామాల్లో శాశ్వత నీటి వనరుల అభివృద్ధి, భూగర్భ జలాల పెంపు, రైతులకు సాగునీటి సౌకర్యాల మెరుగుదల లక్ష్యంగా ప్రభుత్వం పలు చర్యలు చేపడుతోందని తెలిపారు.ఈ సందర్భంగా జలసిరి పథకానికి సంబంధించిన వివరాలతో రూపొ ందించిన అవగాహన పోస్టర్‌ను సర్పంచులు, అధికారులు కలిసి ఆవిష్కరించారు. పోస్టర్‌లో ఇంకుడు గుంతలు, ఫార్మ్ పాండ్లు, పర్కొలేషన్ ట్యాంకులు, చెక్ డ్యాంలు, రీచార్జ్ షాఫ్ట్‌లు వంటి నీటి సంరక్షణ పనుల ద్వారా భూగర్భ జలాల పెంపు, వర్షపు నీటి నిల్వ, సాగునీటి వినియోగం, రైతులకు కలిగే ప్రయోజనాలను వివరించా రు.అనం తరం డీఆర్‌డీఓ అధికారి గీత మాట్లాడుతూ, గ్రామాల్లో నీటి సంరక్షణ చర్యలను ప్రజలందరూ భాగస్వామ్యంతో విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. వర్షపు నీటిని వృథా కాకుండా భద్రపర చడం ద్వారా భవిష్యత్ తరాలకు నీటి భద్రత కల్పించవచ్చని పేర్కొన్నా న్నరు. ప్రభుత్వం అమలు చేస్తున్న జలసిరి కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకుని నీటి వనరుల పరిరక్షణకు సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో ముద్దసాని రమేష్, ఎంపీడీవో రవి సుధాకర్, ఎంపీఓ ప్రభాకర్, సంబంధిత శాఖల అధికారులు, గ్రామ సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

# రాజ్యాంగం కల్పించిన సమాన హక్కులను కాపాడుకుందాం: ఎస్ఐ తిరుపతి

**వీణవంక,జూలై 30 (ప్రజాజ్యోతి)** జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రతి నెల 30వ తేదీన నిర్వహిస్తున్న పౌర హక్కుల దినోత్సవంలో భాగంగా వీణవంక మండలం మల్లారెడ్డిపల్లి గ్రామంలో గురువారం ఘనంగా కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని అంబేద్కర్ సంఘ భవనంలో జరిగిన ఈ కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు, అంబేద్కర్ సంఘ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎస్ఐ తిరుపతి మాట్లాడుతూ భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికి సమాన హక్కులు కల్పించిందని, కుల వివక్ష, అంటరానితనం, హోటళ్లలో రెండు గ్లాసుల విధానం, ప్రార్థనా మందిరాల్లో ప్రవేశ నిరాకరణ వంటి సామాజిక దురాచారాలకు సమాజంలో ఎలాంటి స్థానం లేదని అన్నారు. సామాజిక సమానత్వం నెలకొల్పేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని, ఎస్సీ, ఎస్టీలపై ఎలాంటి వివక్ష జరిగినా వెంటనే పోలీసు, రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలోని ప్రతి గ్రామంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ కుల వివక్ష నిర్మూలన, పౌర హక్కుల పరిరక్షణపై ప్రజలకు చైతన్యం కల్పిస్తున్నట్లు అధికారులు తెలిపారు. గ్రామాల్లో సమానత్వం, సోదరభావం పెంపొందేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కొలిపాక రజిత శ్రీనివాస్, గ్రామ కార్యదర్శి సందీప్, ఆర్ఐ నరసయ్య, జీపీఓ పురుషోత్తం, ఉపసర్పంచ్ అర్షం



శ్రీనివాస్, వార్డు సభ్యులు మోరే వసంత శ్రీనివాస్, కనకం సుజాత కృష్ణ, కర్రె నాని యాదవ్, ముద్దసాని శ్రీనివాస్, మాజీ వార్డు సభ్యులు శనగరపు శ్రీకాంత్, కనకం కుమార్, మోర శ్రీనివాస్, సంజయ్, శ్రీనివాస్, దేవస్వామి, సదయ్య, మండల స్థాయి అధికారులు, అంబేద్కర్ సంఘ సభ్యులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



## ఉమ్మడి కరీంనగర్ జిల్లాను

# ముంచెత్తిన వాన

**రైతన్నలో ఆనందం.. ప్రజల్లో ఆందోళన**

**రెడ్ అలర్ట్ జారీ వాతావరణ శాఖ**

**భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం**

**పొంగిపొర్లుతున్న వాగులు, వంకలు.. నిండుతున్న జలాశయాలు**

కరీంనగర్ బ్యూరో,జూలై 30 (ప్రజాజ్యోతి):

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో గత రెండు రోజులుగా కురుస్తున్న ఎడతెరిపిలేని వర్షాలు ప్రజాజీవనాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయి. కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల జిల్లాల్లో విస్తారంగా వర్షాలు కురవడంతో వాగులు, వంకలు ఉద్ధృతంగా ప్రవహిస్తున్నాయి. చెరువులు, కుంటలు, జలాశయాలు వరద నీటితో కళకళలాడుతున్నాయి. మరోవైపు ఈ వర్షాలు ఖరీఫ్ సాగుకు ఊతమివ్వడంతో రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. భారీ వర్షాల నేపథ్యంలో వాతావరణ శాఖ ఉమ్మడి జిల్లాకు రెడ్ అలర్ట్ జారీ చేసింది. రానున్న 24 నుంచి 48 గంటల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించింది. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వాగులు, వంకలు దాటే ప్రయత్నం చేయవద్దని అధికారులు సూచిస్తున్నారు.

**నగరంలోని వర్ష ప్రభావిత ప్రాంతాలను. పరిశీలించిన మేయర్, డిప్యూటీ మేయర్**

కరీంనగర్ లో గత రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో గురువారం మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ నగరంలోని పలు వర్ష ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించి పరిస్థితిని పరిశీలించారు. ఇందులో భాగంగా కలెక్టరేట్ రోడ్డులో గల ప్రధాన మురుగు నీటి వరద కాలువను తనిఖీ చేసి పరిశీలించి... కలెక్టరేట్ రోడ్డుపై వర్షపు నీరు నిలవకుండా డ్రైనేజీ లోకి ప్రవహించేలా చర్యలు చేపట్టారు. స్థానికంగా ఉండి అధికార సిబ్బంది తో ఫుట్ పాత్ వీప్ హోల్స్ ను తెరిపించారు. నగరపాలక సంస్థ అధికార, సిబ్బందికి పలు ఆదేశాలు జారీ చేశారు. గంగాధర 74.6 మీ, మీ,రామడుగు65.2, చొప్పదండి79.4, కరీంనగర్ రూరల్ 52. 6, గన్నేరువరం 43.8,కరీంనగర్ 54.2,మానకొండూరు 56, తిమ్మాపూర్45.2,చిగురుమామిడి32.8 ,వి.సైదాపూర్ 25.6, శంకరపట్నం 39.8,వీణవంక 28.6,హుజూరాబాద్25.2, జమ్మికుంట 44.4, ఇల్లందకుంట 41.6 మిల్లీ మీ టర్ల వర్షపాతం నమోదయింది.

**కరీంనగర్‌లో నాలలో పడి వృద్ధురాలి మృతి**

కరీంనగర్ నగరంలో కురుస్తున్న వర్షాల మధ్య నాలాలో ప్రమాదవశాత్తు పడి ఓ వృద్ధురాలు మృతి చెందడం విషాదాన్ని మిగిల్చింది. ఈ ఘటనతో అధికారులు నగర ప్రజలను మరింత అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు.

**పాఠశాలలకు సెలవులు ప్రకటించిన విద్యాశాఖ**

భారీ వర్షాల దృష్ట్యా విద్యార్థుల భద్రతను దృష్టిలో ఉంచుకునికరీంనగర్,జగిత్యాల, పెద్దపల్లి జిల్లాల్లో పాఠశాలలకు విద్యాశాఖ సెలవులు ప్రకటించింది. పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ అవసరమైన చర్యలు చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు .పొంగి పొర్లుతున్న వాగులు.. పెరుగుతున్న జలాశయాల నీటిమట్టంనిరంతర వర్షాలతో జిల్లాలోని చిన్నా పెద్ద వాగులు, వంకలు ఉద్ధృతంగా ప్రవహిస్తున్నాయి. పలు చెరువులు పూర్తిస్థాయిలో నిండగా, జలాశయాలకు భారీగా వరద నీరు చేరుతోంది. లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలవడంతో కొన్ని చోట్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఇటీవలి కాలంలో వర్షాభావంతో ఇబ్బందులు పడిన రైతులకు ఈ వర్షాలు ఊరటనిచ్చాయి. వరి, పత్తి, మొక్కజొన్న తదితర ఖరీఫ్ పంటలకు తగిన తేమ లభించడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. సాగునీటి వనరులు మెరుగుపడటంతో ఈ సీజన్‌లో మంచి దిగుబడులు వస్తాయని ఆశాభావం వ్యక్తమవుతోంది.

**అధికార యంత్రాంగం అప్రమత్తం**






రామగుండం మున్సిపల్ పరిధిలోని 25 వ డివిజన్ లో వరద పరిస్థితిని రామగుండం శాసనసభ్యులు రాజ్ ఠాకూర్ మక్కాన్ సింగ్ తో కలిసి పర్యటించిన జిల్లా కలెక్టర్





జిల్లా యంత్రాంగం పోలీసు, రెవెన్యూ, విపత్తు నిర్వహణ శాఖలతో సమన్వయం చేసుకుంటూ పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తోంది. ప్రమాదకర ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడంతో పాటు అవసరమైన చోట సహాయక చర్యలు చేపట్టేందుకు సిబ్బందిని సిద్ధంగా ఉంచింది. ఒకవైపు రైతులకు వరంగా మారిన వర్షాలు... మరోవైపు ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిన పరిస్థితలు నెలకొన్నాయి. వాతావరణ శాఖ హెచ్చరికలను తప్పనిసరిగా పాటించాలని అధికారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# భారీ వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి






రాయికల్, జూలై 30 (ప్రజా జ్యోతి) రాయికల్ మండలంలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ప్రజల ప్రాణాలు, ఆస్తులకు ఎలాంటి ప్రమాదం జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీడీవో చిరంజీవి, ఎమ్మార్వో నాగార్జున సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం మండలంలోని పలు గ్రామపంచాయతీ లను సందర్శించి వర్షాల ప్రభావాన్ని పరిశీలించిన వారు గ్రామపంచాయతీ కార్యదర్శులు, జిపిఓ లను అప్రమత్తం చేశారు. వరద నీరు ప్రవహిస్తున్న వంతెనలు, కల్వర్టుల వద్ద వెంటనే బ్యారికేడ్లు ఏర్పాటు చేసి ప్రజలు, వాహనాల రాకపోకలను తాత్కాలికంగా నిలిపివేయాలని సూచించారు. శిథిలావస్థలో ఉన్న ఇళ్లలో నివసిస్తున్న కుటుంబాలను వెంటనే సురక్షిత ప్రాంతాలకు తరలించి, వారికి అవసరమైన వసతి, తాగునీరు, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. చెరువులు, కుంటలు నిండిన నేపథ్యంలో చేపలు పట్టేందుకు లేదా సందర్శనకు ఎవరూ వెళ్లకుండా చర్యలు తీసుకోవడంతో పాటు ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు నిల్వ ఉంటే తక్షణమే డీ–వాటరింగ్ చర్యలు చేపట్టి నీటిని తొలగించాలని సంబంధిత సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో రాయికల్ మున్సిపల్ చైర్‌పర్సన్, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, కౌన్సిలర్లు, ఉపసర్పంచ్‌లు, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు, జిపిఓ లు మరియు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులు ప్రజలకు విజ్ఞప్తి చేస్తూ, అత్యవసర పరిస్థితులు మినహా వరద ప్రభావిత ప్రాంతాలు, వాగులు, చెరువులు, కల్వర్టుల వద్దకు వెళ్లకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రజల సహకారంతోనే ప్రాణనష్టం, ఆస్తి నష్టాన్ని నివారించవచ్చని పేర్కొన్నారు.

## నేటి యువతకు ఆదర్శంగా నిలుస్తున్న 3వ వార్డ్ కౌన్సిలర్ అభ్యర్థి సోమిడి నరేష్



పుట్టినరోజు అంటే మందు చిందు విందులు వినోదాలు మాత్రమే అని అనుకుంటాం కానీ వాటికి ఆయ్యే ఖర్చుతో బీద కుటుంబాలని ఆదుకోవచ్చు అని నిరూపించి నేటి యువతకు ఆదర్శంగా నిలిచారు ఇందిరానగర్ కాలనీ 3వ వార్డ్ కౌన్సిలర్ అభ్యర్థి సోమిడి నరేష్ తన జన్మదిన వేడుకలకి ఆయ్యే ఖర్చుతో తన వార్డ్ లో ఉన్న మేకల శేఖర్ అనే బిల్డింగ్ కార్మికుడు 6నెలల క్రితం ప్రమాద వశాత్తు బిల్డింగ్ పై నుండి కింద పడి కాలు విరగగా వైద్య ఖర్చులకి సహాయం చేసి అంతే కాకుండా ఈ రోజు ఇంట్లో నిత్య అవసర వస్తువులను అందించి తన ఉదారతను చాటుకున్నాడు. అదే వార్డ్ కి చెందిన కారం లక్ష్మణ్ అనే యువకుడు (మున్సిపల్ కార్మికుడు ) పారిశుద్ధ పనులు చేస్తుండగా కుడి కాలు కి ఫ్యాక్చర్ కాగా కొన్ని నెలలు గా ఇంట్లోనే ఉంటూ జీవనోపాధి కష్టం గా మారిందని తెలుసుకున్న సోమిడి నరేష్ వారికి కూడా నిత్య అవసర సరుకులు అందించి ఆదుకున్నారు. నాయకులు అంటే ఏదో ఎలక్షన్ ల సమయం లో వచ్చి హడావిడి చేసి వెళ్ళిపోతారు కానీ తాను ఎటువంటి పదవిలో లేకపోయినా మానవతా హృదయం తో ఆపదలో ఉన్న కుటుంభాలని గుర్తించి మరి సహాయం చేసినందుకు వార్డ్ ప్రజలు యువకులు ఆయనని అభినందించారు. ఈ కార్యక్రమం లో అక్కవత్తుల నరేష్, కాంగ్రెస్ నాయకులు పొట్ట గోపాల్, సోమిడి శివ, సోమిడి మహేందర్,బూరం విశ్వాస్, సోమిడి రాజ్ కిరణ్,మేకల రాజు,సోమిడి మనోహర్, దాసరి సుమిత్,దయ్య రఘువీర్, సోమిడి రంజిత్,సోతుకు శ్రీనివాస్, సోమిడి జయరాం, దాసరి నవీన్,సోమిడి శ్యామ్ ప్రసాద్,సోమిడి రాము, తదితరులు పాల్గొన్నారు.

## వర్షానికి ఇంటి గోడ కూలింది.. పెను ప్రమాదం తప్పింది



కొడిమ్యాల, జూలై 30,(ప్రజాజ్యోతి): ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా కొడిమ్యాల మండలం సూరంపేట గ్రామంలో ఓ ఇంటి గోడ కూలిపోవడంతో పెను ప్రమాదం తప్పింది. గ్రామానికి చెందిన చెప్యాల లక్ష్మి నివాసగృహం గోడ గురువారం ఒక్కసారిగా కూలిపోయింది. ఘటన సమయంలో ఎవరూ గోడ సమీపంలో లేకపోవడంతో ప్రాణనష్టం జరగలేదు. అయితే గోడ కూలడంతో ఇంట్లోని గృహోపకరణాలు, ఇతర సామగ్రి ధ్వంసమయ్యాయి. భర్త శంకర్ సంవత్సరం క్రితం చనిపోగా, ఇప్పటికే కష్టాల్లో ఉన్న లక్ష్మికి ఈ ఘటన మరింత విషాదాన్ని మిగిల్చింది. విషయం తెలుసుకున్న సర్పంచ్ అక్కేనపల్లి గంగవ్వ వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని నష్టాన్ని పరిశీలించారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం నుంచి తక్షణ ఆర్థిక సహాయం అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో పాత ఇళ్లు, శిథిలావస్థలో ఉన్న గృహాలు, పూరి గుడిసెల్లో నివసించే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అధికారులు కూడా ప్రమాదకరమైన ఇళ్లను గుర్తించి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.



## చైత్యభూమిలో అంబేద్కర్‌కు నివాళి

– రాజ్యాంగ అధ్యయనం ప్రతి ఒక్కరి బాధ్యత: ఏలీయా



కొడిమ్యాల, జూలై 30,(ప్రజాజ్యోతి): ముంబైలోని బాబాసాహెబ్ అంబేడ్కర్ సమాధి స్థలం చైత్యభూమిని మానవ హక్కుల నేర నిరోధక సంఘం జగిత్యాల జిల్లా ప్రతినిధులు గురువారం సందర్శించారు. జిల్లా అధ్యక్షుడు పర్లపల్లి ఏలీయా, సభ్యులు బొడ్డెల్లి లక్ష్మణ్, చిర్ర రమేశ్, చిర్ర దాస్ కలిసి అంబేడ్కర్‌కు ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఏలీయా మాట్లాడుతూ.. ముంబై పేరు వినగానే బాబాసాహెబ్ అంబేడ్కర్ నివాసమైన రాజగృహం, చైత్యభూమి, మాత రమాయి సమాధి త్యాగభూమి వంటి చారిత్రక ప్రదేశాలు గుర్తుకు వస్తాయని అన్నారు. భారత రాజ్యాంగం ద్వారా దేశంలోని అన్ని మతాల ప్రజలకు తమ మతాన్ని ఆచరించే, ప్రచారం చేసుకునే హక్కు కల్పించిన ఘనత డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్‌కే దక్కుతుందన్నారు. ప్రతి ఒక్కరూ రాజ్యాంగాన్ని అధ్యయనం చేసి, మహాత్మా జ్యోతిరావు పూలే––అంబేడ్కర్ ఆశయాలను ఆచరించాలని పిలుపునిచ్చారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రజలు పూలే––అంబేడ్కర్ సిద్ధాంతాలను స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక పాస్టర్ అబ్బా ప్రభుదాస్ (ఘాట్‌కోపర్) సంఘీభావం తెలిపారు.

## ఏఐ––రెడీ క్యాంపస్‌గా నాచుపల్లి జేఎన్టీయూహెచ్ కళాశాల



కొడిమ్యాల, జూలై 30, (ప్రజాజ్యోతి): మండలంలోని నాచుపల్లి జేఎన్టీయూ ఇంజినీరింగ్ కళాశాల (అటానమస్) ప్రముఖ అంతర్జాతీయ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సంస్థ రెడ్రాబ్ ఎఐతో గురువారం ఆన్‌లైన్‌లో అవగాహన ఒప్పందం (ఎంఓయూ) కుదుర్చుకుంది. ఈ ఒప్పందం మేరకు విద్యార్థులు, అధ్యాపకులు, ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ విభాగానికి ఆరు నెలల పాటు రెడ్రాబ్ ఎఐ ప్లాట్‌ఫారమ్ సేవలు ఉచితంగా అందనున్నాయి. ఈ వేదిక ద్వారా విద్యార్థులకు ఎఐ ఆధారిత రెజ్యూమ్ బిల్డింగ్, జాబ్ మ్యాచింగ్, ఇంటర్వ్యూ ప్రిపరేషన్, ఉద్యోగార్హత స్కోరింగ్ వంటి సేవలు అందుబాటులోకి రానున్నాయి. అధ్యాపకులకు పరిశోధన, అసెస్‌మెంట్ రూపకల్పనలో, ప్లేస్‌మెంట్ అధికారులకు హెచ్‌ఆర్ బృందాలతో నేరుగా అనుసంధానమయ్యే అవకాశాలు కల్పించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ భాగస్వామ్యంతో కళాశాల పూర్తి స్థాయి 'ఏఐ––రెడీ క్యాంపస్' గా రూపుదిద్దుకోనుందని కళాశాల ప్రిన్సిపాల్ డా. జి. నరసింహ, ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డా. బి. సతీష్ కుమార్ తెలిపారు. కార్యక్రమంలో కళాశాల యాజమాన్యంతో పాటు రెడ్రాబ్ సంస్థ ప్రతినిధులు ఆన్‌లైన్ ద్వారా పాల్గొన్నారు.

## భారీ వర్షాలకు కల్వర్ట్ కుంగిపోవడం.. 21వ వార్డులో అధికారుల పరిశీలన

మెట్‌పల్లి, జూలై 30,ప్రజా జ్యోతి: మెట్‌పల్లి మున్సిపాలిటీ 21వ వార్డులోని సీఎంఎస్ గోదాం ఎదురుగా ఉన్న కల్వర్ట్ కుంగిపోవడంతో స్థానిక ప్రజలు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. ప్రమాదం సంభవించే అవకాశం ఉండటంతో వెంటనే స్పందించిన స్థానిక ప్రజాప్రతినిధులు రాత్రి వేళలోనే ప్రమాద సూచికలను ఏర్పాటు చేసి ప్రజలను అప్రమత్తం చేశారు. ఈ సమస్యను కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ జువ్వాడి నర్సింగరావు దృష్టికి తీసుకెళ్లడంతో పాటు, మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రికి సమాచారం అందించారు.